


అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

13.08.2026
గురువారం| రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 44
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# మీరు మారిపోయారు

- మోడీ, ప్రియాంకా మధ్య సరదా సంభాషణ
- చాలా మారిపోయారని ఖర్గే కౌంటర్
- వైరల్ అవుతున్న వీడియో



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, అనంత జనశక్తి న్యూస్**

ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కుమార్తె వివాహ విందుకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే వంటి వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేతలు తమ రాజకీయ విభేదాలను పక్కన పెట్టి సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోడీ, ప్రియాంకాగాంధీ, ఖర్గేల మధ్య సరదా సంభాషణ జరిగింది.

2లో..

# మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- బీసీ మహిళలకు
- ఆటోమేటిక్ కుట్టు మిషన్ల
- నేడు పంపిణీ చేస్తున్నాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.



రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నారు.
లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయడం ఈ పథకం ప్రత్యేకత.

2లో..

# పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి కాదు

- భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛపై
- బాంబే హైకోర్టు సంచలన తీర్పు
- మేజర్ కుమార్తె కస్టడీ కోరుతూ..
- తల్లి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

2లో..



# గోదావరి జలాలను గరిష్ఠస్థాయిలో వినియోగించుకోవాలి

## అధికారుకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

- సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోయాలి
- ఎన్డీఎస్ఏ సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదు



**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్ చెప్పగా.. మూడు బ్యారేజీల విషయంలో ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం రేవంత్ సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

6లో..

దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాల్లోని కొన్ని వ్యవసాయ భూములకు పెండింగ్‌లో ఉన్న పరిహారం వెంటనే చెల్లించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని చెప్పారు. అధికారులు ఆ పనులను పూర్తి చేస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలన్నారు.

**డిఫాల్ట్ మిల్లులను స్వాధీనం చేసుకోవాలి**

తెలంగాణలో రైస్ మిల్లర్ల గోల్‌మాల్ వ్యవహారాలు , పెండింగ్ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పౌర సరఫరాల శాఖపై గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డిఫాల్ట్ మిల్లుల స్వాధీనం.. మహిళా సంఘాలకు బిగ్ ఆఫర్**

ఉద్దేశపూర్వకంగా డీఫాల్ట్ అయి ప్రభుత్వ బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# త్వరలో జంతర్‌మంతర్2

- అభిజీత్ దిప్కే ప్రకటన
- సీజేపీ వాలంటీర్ల సమావేశానికి పర్మిషన్ నో
- బీజేపీపై సీజేపీ అధ్యక్షుడు దీప్కే ఆరోపణలు

2లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, అనంత జనశక్తి న్యూస్**

త్వరలోనే జంతర్ మంతర్-2 నిరసన ప్రారంభం అవుతుందని సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దిప్కే ప్రకటించారు. ఢిల్లీలో పార్టీ వాలంటీర్ల సమావేశానికి హాలు కేటాయించనందుకు బీజేపీపై అభిజీత్ దిప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ సమావేశం జరగకుండా ఒత్తిడి చేశారని, చివరికి బుక్ చేసిన హాలు యజమానులను బెదిరించారని ఆరోపించారు.

# రూ.323 కోట్లతో ఉప్పాడ తీరంలో రక్షణ గోడ



2లో..

# రోడ్డెక్కడం కాదు.. అసెంబ్లీకి రావాలి

- వైసీపీకి అనిత సూచన
- సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఎమ్మెల్యేలదే

**అమరావతి, ఆగస్ట్ 12, అనంత జనశక్తి న్యూస్**

అసెంబ్లీకి రాకుండా బయట ఆరోపణలు చేయడమేంటి? అని వైసీపీని ఏపీ హోంమంత్రి అనిత ప్రశ్నించారు. ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం వంగలపూడి అనిత మీడియాతో మాట్లాడారు. ''వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ.. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు.

5లో..

# మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతాం

- ఇదే మా ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి సీతక్క సంచలన కామెంట్లు
- మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం

5లో..



# భయపడొద్దు, పారిపోవద్దు

- అమిత్ షా వస్తున్నాడు
- బీజేపీ ప్రతిపక్ష కాంగ్రెస్‌కు సవాల్ విసిరింది
- అమిత్ షా సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నారు

2లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 12, అనంతజనశక్తి న్యూస్**

పార్లమెంట్ వర్షకాల సమావేశాలు ముగియడానికి ముందు బీజేపీ ప్రతిపక్ష కాంగ్రెస్‌కు సవాల్ విసిరింది. విద్యార్థుల నిరసన, లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్ ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వం చెబుతుండగా, ప్రధాని నరేంద్రమోడీ క్షమాపణలు చెప్పే వరకు నిరసనలు కొనసాగిస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. విద్యార్థులపై పోలీసుల దాడులకు అమిత్ షా బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. పార్లమెంట్ సమావేశాలకు పదే పదే ప్రతిపక్షాలు అంతరాయం కలిగిస్తున్నాయి.

# జూనియర్ డాక్టర్ల సమ్మె

- సర్కార్‌కు వైద్యుల అల్టిమేటం.!
- 15 శాతం స్టైపెండ్ పెంపు కోరితే 3 శాతమేనా?
- ప్రభుత్వంతో చర్చలు విఫలం.. సమ్మె కొనసాగింపు

2లో..




# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా?

- రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఫైర్
- తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని..
- ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ ఎజెండాలో పెడితే..
- ఇంతకాలం ఎందుకు నోరు మెదపలేదు?

2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 12, అనంత జనశక్తి న్యూస్**

బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా రేవంత్ రెడ్డి? తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ఏపీ ప్రభుత్వం GRMB ఎజెండాలో పెడితే.. ఇంతకాలం ఎందుకు నోరు మెదపలేదు? అని మాజీ మంత్రి హరీష్‌రావు నిలదీశారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని ఏపీ ప్రతిపాదిస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఎందుకు వెంటనే అభ్యంతరం చెప్పలేదని ఎక్స్ పోస్ట్‌లో ప్రశ్నించారు.




# సైబర్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

- ఫోన్ మోగితే చాలు.. మోసగాళ్ల వలలో పడుతున్న జనం
- ఓటీపీ చెప్పకపోయినా ఖాతా ఖాళీ.. కొత్త తరహా సైబర్ మోసాలు.. డిజిటల్ యుగంలో దొంగలూ డిజిటల్‌గానే!
- ఆశ చూపి.. భయపెట్టి ఖాతాలు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు

**తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్**

ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాల సంఖ్య కూడా ఆందోళనకరంగా పెరుగుతోంది. ప్రజల అత్యాశ, భయం, నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, విద్యుత్ శాఖ సిబ్బంది, కొరియర్ సంస్థల పేర్లతో ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మరికొందరు ప్రభుత్వ అధికారులమంటూ బెదిరించి వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు.

6లో..





# మీరు మారిపోయారు

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ ''ప్రియాంకా గాంధీ గారు మీరు ఎలా ఉన్నారు.?'' అని ప్రశ్నించారు. దీనికి బదులుగా ప్రియాంకాగాంధీ ''నేను బాగున్నాను సార్, మీరు ఎలా ఉన్నారు?'' అని అడిగారు. దీనికి మోడీ స్పందిస్తూ.. ''నేను అంతే'' అంటూ బదులిచ్చారు. ఇదే సమయంలో ఖర్గే చర్చలోకి చేరి ప్రధాని మోడీతో ''సోదరా మీరు కొంచెం మారారు'' అని అన్నారు. దీనికి ప్రధాని మోడీ స్పందిస్తూ.. ''అచ్చా'' అని అన్నారు. దీంతో అక్కడ ఉన్న నేతల మధ్య నవ్వులు విరబూశాయి. దీని తర్వాత ప్రధాని మోడీ అందరికి చేతులు జోడించి అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ కూడా అక్కడే ఉన్నారు. మోదీ, ఖర్గే మధ్య జరిగిన సంభాషణను విని రాహుల్ కూడా చిరునవ్వుతో కనిపించారు.
ఖర్గే చేసిన 'మీరు మారిపోయారు'' అనే వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా డీకోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ సందర్భానుసారం ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారా అని ఆలోచిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల నిరసన నేపథ్యంలో ''జెన్ జీ'' యువతను ఆకట్టుకోవడానికి మోడీ సెల్ఫీ తరహా ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు చేశారు. ఈ ధోరణిపై ఖర్గే అన్నారని భావిస్తున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఎస్పీ నేత శరద్ పవార్‌తో మోడీ మాట్లాడుతూ కనిపించారు. ఎన్సీపీ ఎస్పీకి చెందిన ఎంపీలు ఎన్డీయే కూటమిలో చేరుతారనే వార్తలు వినిపించిన నేపథ్యంలో ఈ కలయిక ఆసక్తికరంగా మారింది.

# మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 13, 2026 గురువారం మధ్యాహ్నం 12:00 గంటలకు హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని జీ29లో ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. కుట్టు వృత్తిపై నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంచి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయాన్ని ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. పథకం విధి విధానాలు, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగస్టు 13న నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెల్లడించనున్నారు.
ఈ కార్యక్రమంలో బీసీ మంత్రులు, బీసీ ఎంపీలు, బీసీ ఎమ్మెల్యేలు, బీసీ ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు.బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తూ, మహిళలను ఆర్థికంగా శక్తివంతం చేసే దిశగా ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కీలక ముందడుగుగా నిలవనుంది.

# త్వరలో జంతర్‌మంతర్2



(మొదటి పేజీ తరువాయి)

''చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌లో జంతర్ మంతర్ సీజన్ 2 ఎప్పుడు వస్తుందని అడుగుతున్నారు. కాబట్టి నేను వారికి చెప్పేది ఏమిటంటే జంతర్ మంతర్ సీజన్ 2 చాలా త్వరలో ప్రారంభం కాబోతోంది.'' అని అన్నారు.
''మేము ఈరోజు ఢిల్లీలో ఒక వాలంటీర్ల సమావేశం నిర్వహించాల్సి ఉంది. దాని కోసం మేము ఒక హాల్ వెతుకుతున్నాం. కానీ ఎవరూ అద్దెకు ఇవ్వడానికి ముందుకు రాలేదు. ప్రతిచోటా పైనుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారు. ఎంతో కష్టపడి సీజేపీ ఒక హాలును బుక్ చేసుకుందని.. అందుకు సంబంధించిన రసీదు కూడా పార్టీ దగ్గర ఉందని పేర్కొన్నారు. అయితే మంగళవారం ఉదయం హాలు యజమానులకు బెదిరింపులు వచ్చాయి. ''సీజేపీ సమావేశం అక్కడ జరగడానికి అనుమతిస్తే.. వారిని తలకిందులుగా వేలాడదీస్తామని హాలు యజమానులను బెదిరించారు. ఇదంతా బీజేపీయే చేస్తోంది.'' అని ఆరోపించారు.
ఇలాంటి చర్యలు దేశ యువత అంటే బీజేపీకి భయంగా ఉందని స్పష్టంగా చూపిస్తున్నాయని దీప్కే అన్నారు. ''ఇలాంటి చిన్న చిన్న చర్యలకు మేము భయపడతామని వారు అనుకుంటే.. వారు చాలా పొరపాటు పడుతున్నారు.''' అని అన్నారు. అయితే హాల్ బుకింగ్‌ల విషయంలో ఒత్తిడి, బెదిరింపుల గురించి అభిజీత్ దీప్కే చేసిన ఆరోపణలపై బీజేపీ ఇంకా స్పందించలేదు.

# పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి కాదు

ముంబై, ఆగస్టు 12, అనంతజనశక్తి న్యూస్



వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణ దిశగా బాంబే హైకోర్టు అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వయోజనులైన పిల్లలు స్వతంత్ర వ్యక్తులని, వారు తల్లిదండ్రుల ఆస్తి కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. మేజర్లు అయిన యువతీ యువకులు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను కలిగి ఉంటారని.. వారి నిర్ణయాల్లో ఇతరులు జోక్యం చేసుకోలేరని తేల్చి చెప్పింది.

**అసలేం జరిగిందంటే..?**

నాగ్‌పూర్‌కు చెందిన ఓ యువతి.. 17 ఏళ్ల వయస్సులో ట్యూషన్ క్లాసుల కోసం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు.. సదరు బాలిక ఒక యువకుడితో వెళ్లినట్లు గుర్తించారు. ఆపై ఆమెను పట్టుకుని తల్లికి అప్పగించారు. అయితే ఆ తర్వాత కొంతకాలానికి ఆ యువతి మళ్లీ ఇల్లు వదిలి సదరు యువకుడి వద్దకు వెళ్లిపోయింది. దీంతో కుమార్తె కస్టడీని తనకు అప్పగించాలని కోరుతూ తల్లి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. మైనర్‌గా ఉన్నప్పుడు ఆ యువకుడు తన కుమార్తెను అక్రమ నిర్బంధంలో ఉంచాడని, అతనిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయలేదని తల్లి ఆరోపించింది. అంతేకాకుండా తన కుమార్తెను తన కస్టడీకి అప్పగించాలంటూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ జరిపిన న్యాయస్థానం షాకింగ్ కామెంట్లు చేసింది. యువతి స్వయంగా తీసుకున్న నిర్ణయం మేరకు, స్వీయ ఆలోచనలతోనే భాగస్వామిని ఎంచుకుని జీవిస్తోందని కోర్టు గుర్తించినట్లు చెప్పింది. ఈ నేపథ్యంలోనే తన నిర్ణయాన్ని వ్యక్తపరిచిన యువతి హక్కును సమర్థిస్తూ.. సదరు తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.

**హెబియస్ కార్పస్ పిటిషన్ చెల్లదు..!**

ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం చట్టపరమైన అంశాలపై స్పష్టత ఇచ్చింది. ఒక వ్యక్తిని ఎవరైనా అక్రమంగా నిర్బంధించినప్పుడు, వారిని న్యాయమూర్తి ముందు ప్రవేశ పెట్టాలని కోర్టును కోరే చట్టపరమైన విజ్ఞప్తే 'హెబియస్ కార్పస్' పిటిషన్ అని తేల్చి చెప్పింది. ఒక మేజర్ అమ్మాయి తన ఇష్టపూర్వకంగా ఒక వ్యక్తిని భాగస్వామిగా ఎంచుకుని కలిసి ఉంటున్నప్పుడు.. ఆమె కస్టడీని పొందేందుకు హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపయోగించడం సాధ్య పడదని హైకోర్టు స్పష్టం చేసింది.

**వయోజనుల స్వేచ్ఛకు ప్రాధాన్యత..!**

వ్యక్తిగత హక్కులకు అత్యున్నత పీఠం వేసిన ఈ తీర్పు.. కుటుంబాల పేరుతో వయోజనుల నిర్ణయాలపై ఆధిపత్యం చెలాయించలేరని పునరుద్ఘాటించింది. మేజర్ అయిన ప్రతీ ఒక్కరికీ వారి వ్యక్తిగత జీవితం, భాగస్వామి ఎంపిక విషయంలో రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ ఉంటుందని పేర్కొంది. అలాగే వారి అభిప్రాయాలను గౌరవించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని న్యాయస్థానం తేల్చి చెప్పింది. అంతేకాకుండా పిల్లలేమీ తల్లిదండ్రుల ఆస్తి కాదని వివరించింది. ఆ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకోవాలని కూడా తెలిపింది.

# భయపడొద్దు, పారిపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)



ఈ నేపథ్యంలో బీజేపీ నేత సుధాన్షు త్రివేది ప్రతిపక్షాల విమర్శలపై తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సమావేశాల సమయంలో సభ నుంచి వెళ్లిపోతున్నారని, సమావేశాల అనంతరం విదేశాలకు వెళ్తున్నారని విమర్శించారు. "భయపడకండి.. పారిపోకండి.. సభలో అమిత్ షా చెప్పేది వినండి" అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. విద్యార్థుల నిరసనలపై హోం మంత్రి సమగ్రంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారని, కేవలం ప్రకటన చేయడం కాకుండా ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.
ఇదిలా ఉంటే, నిరసనకారులపై పోలీస్ చర్య, అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల అంశంలో ప్రధాని నరేంద్రమోడీ క్షమాపణలు చెప్పే వరకు పార్లమెంట్‌లో తమ నిరసన కొనసాగుతుందని కాంగ్రెస్ ప్రకటించింది. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించమని అమిత్ షా ఆదేశించారా లేదా అనే దానిపై స్పష్టత కావాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# జూనియర్ డాక్టర్ల సమ్మె

అమరావతి, ఆగస్టు 12, అనంత జనశక్తి న్యూస్



విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మెకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. 2009 జీవో నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంపు చేపట్టాల్సి ఉందని, కనీసం 15 శాతం పెంచాలని కోరితే ప్రభుత్వం కేవలం 3 శాతం మాత్రమే పెంచుతామని చెప్పడం వైద్యులను తీవ్రంగా అవమానించడమేనని జూనియర్ వైద్యుల సంఘం విశాఖ అధ్యక్షుడు దినకర్ మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతినిధులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని, అందుకే తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మెను కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అహోరాత్రులు సమయంతో సంబంధం లేకుండా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న జూనియర్ డాక్టర్ల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆరోగ్య శాఖ మంత్రి తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
సమ్మె మరింత తీవ్ర రూపం దాల్చకముందే ప్రభుత్వం పునరాలోచించి మేల్కోవాలని, ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు నిలిచిపోయే దుస్థితి తెప్పించవద్దని వైద్య సంఘాల నాయకులు హెచ్చరించారు. ఏపీ జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంపు డిమాండ్లను వెంటనే నెరవేర్చడంతో పాటు, డాక్టర్ల పదవీ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పరిమితం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న పాలకులు చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరిస్తేనే విధుల బాట పడతామని, లేని పక్షంలో తమ పోరాటం ఆపేది లేదని జూనియర్ వైద్యులు కుండబద్దలు కొట్టారు.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా?

(మొదటిపేజీ తరువాయి)



ఎందుకు GRMBని నిలదీయలేదు? ఎందుకు ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు? బీఆర్ఎస్ ప్రశ్నించిన తర్వాత హడావుడిగా లేఖలు రాయడం తప్ప.. తెలంగాణ ప్రయోజనాల పట్ల మీకు అసలు చిత్తశుద్ధి లేదా? అని నిలదీశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.. మీ నామమాత్రపు లేఖలు తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుతాయా? లేఖలతో పనులు కావు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేయాలన్నారు.
"ఏపీ ప్రభుత్వం GRMB ఎజెండాలో పెట్టిన అంశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. అవి ఎజెండా నుంచి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలి. అవసరమైతే.. ఆ అంశాలు వెనక్కి తీసుకోకపోతే GRMB సమావేశానికి హాజరు కాబోమని కరాఖండిగా తేల్చి చెప్పాలి. అలా కాకుండా మీ రాజకీయ అవసరాల కోసం మీటింగ్‌కు వెళ్లి.. అక్కడ తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ పెట్టిన అభ్యంతరాలకు బలం చేకూర్చేలా వ్యవహరిస్తే మాత్రం బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. రేవంత్ రెడ్డి.. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన విషయం. తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన విషయం. ప్రతిపక్షాలపై పిచ్చి ప్రేలాపనలు చేసే రేవంత్ రెడ్డి.. రాష్ట్ర ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబితే ఎందుకు నోరు మెదపడం లేదు? ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగే GRMB సమావేశం ఎజెండాను ఉపసంహరించుకోకుండా నిర్వహిస్తే.. తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకోవడం కోసం బీఆర్ఎస్ పార్టీ వేలాది మందితో GRMB కార్యాలయాన్ని ముట్టడిస్తుందని హెచ్చరిస్తున్నాం. కేంద్రం చేతిలో ఉన్న GRMB, చంద్రబాబు, రేవంత్ కలిసి తెలంగాణకు చేస్తున్న జల ద్రోహాన్ని అడ్డుకుంటాం." అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.

# రూ.323 కోట్లతో ఉప్పాడ తీరంలో రక్షణ గోడ

అమరావతి, ఆగస్టు 12, అనంతజనశక్తి న్యూస్

సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, డీపీఆర్, సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో ఒప్పందం కుదిరింది. మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఒప్పంద పత్రాలపై సంబంధిత అధికారులు సంతకాలు చేశారు. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది.
ఐఐటీ మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు. ఐఐటీ మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో నవంబర్ నుంచి పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా అధికారులు భావిస్తున్నారు.




# ప్రకాష్‌రాజ్ బతికి ఉన్నారని నిరూపించుకోవాలి

**ఓటు తొలగింపు వివాదం**
**బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి**

బెంగళూరు, అనంతజనశక్తి న్యూస్

బెంగళూరులో ఓటరు జాబితాలో నుంచి తన ఓటు తొలగించారంటూ సినీనటుడు ప్రకాష్ రాజ్ విమర్శించిన సంగతి తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో ప్రకాష్ రాజ్ షేర్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపైఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. ప్రకాష్ రాజ్ నిత్యం ఏదో ఒక వివాదంలో నిలుస్తూ ప్రచారం కోరుకుంటున్నారని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. ఈ క్రమంలోనే సర్ ప్రక్రియలో తన ఓటును తొలగించారని సోషల్ మీడియాలో ప్రకాష్ రాజ్ పోస్టు పెట్టారని విమర్శించారు.
"నేను ప్రకాష్‌రాజ్‌ను సూటిగా ఓ విషయం అడుగుతున్నా. మీరు సర్ ఫారమ్ నింపాలి, అధికారులు వచ్చినప్పుడు ఇంటి వద్ద ఉండాలి. మీరు బతికి ఉన్నారని నిరూపించుకోవాలి. సోషల్ మీడియాలో, ట్విటర్‌లో బతికి ఉన్నామని నిరూపించుకునే పని అడ్మిన్లు కూడా చేయగలుగుతారు. మీ పేరు శాశ్వతంగా షిఫ్ట్ అయినట్లు మీరు పెట్టిన ఫారంలో ఉంది. అంటే మీరు వేరే ప్రాంతంలో ఉన్నారని.. మీరు వేరే ప్రాంతంలో ఉన్నప్పుడు మీరు ధ్రువీకరణ ఇవ్వకుండా ఆ విషయం ప్రభుత్వానికి, అధికారులకు ఎలా తెలుస్తుంది? అధికారులు, ఎన్నికల సంఘానికి ధ్రువీకరణ పత్రం అవసరం. ఎందుకంటే మీరు నాలుగు రాష్ట్రాల్లో ఓటు కలిగి ఉన్నారు. మీ మీద కేసు నమోదైంది. బెయిల్ తెచ్చుకున్నారు. ఓటు హక్కును దుర్వినియోగం చేసినట్లు కోర్టులో కేసు ఎదుర్కొంటున్నారు." అని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. "గేమ్ ఆన్ అని ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నావ్.. ఓటు హక్కు లేని నీలాంటివాడితో ఏం గేమ్ ఆడతాం.. ఇది సినిమా షూటింగ్ కాదు. ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యంలో చట్టాన్ని గౌరవించాలి, చట్టబద్ధంగా బతకాలి, చట్టపరిధిలో ఉండాలనే కనీస జ్ఞానం మీకు లేదు. ఒక పౌరుడిగా మీరు భారతదేశంలో ఉన్నట్లు, బతికి ఉన్నట్లు, కర్ణాటకలో ఉన్నట్లు ధ్రువీకరించుకుని ఓటుహక్కును రెన్యువల్ చేసుకోండి. " అని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు.
మరోవైపు ప్రకాష్‌రాజ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది. సర్ ప్రక్రియలో భాగంగా అధికారులు పరిశీలన కోసం వెళ్లిన సమయంలో.. ప్రకాష్ రాజ్ నాలుగు సంవత్సరాల క్రితమే తన చిరునామా నుంచి వేరే ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసిందని



పేర్కొంది. ఈ విషయాన్ని ప్రకాష్ రాజ్ కూడా అంగీకరించారని.. కొత్త అడ్రస్ ఆధారంగా ఆయన తన ఓటును పునరుద్ధరించుకోవచ్చని, ఇందుకు ఫారం 6 దాఖలు చేయాలని సూచించింది.

# అధికార, ప్రతిపక్షాలపోటాపోటీ




ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. సభలు జరగడం లేదు. వరుసగా 17వ రోజూ పార్లమెంటు ఉభయ సభలు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదాపడ్డాయి. అటు అధికార ఎన్డీయే, ఇటు ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు పట్టువీడకపోవడంతో సభల స్తంభన కొనసాగుతోంది. ఈ గందరగోళాల నడుమే ఎటువంటి చర్చ లేకుండా మంగళవారం రెండు బిల్లులను లోక్‌సభ ఆమోదించింది. మరోవైపు పార్లమెంటు ప్రాంగణంలోనూ రెండు పక్షాలు ఢీకొన్నాయి. నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. సభలు సాగకపోవడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ పక్షాలు ఉమ్మడి అంగీకారానికి వచ్చి సభలు సజావుగా సాగడానికి సహకరించాలని సూచించారు. అయినా పెద్దగా ఫలితం కనిపించలేదు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే అమిత్ షా వచ్చి సమాధానం చెప్పాలని ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది.

సభ మళ్లీ 2 గంటలకు సమావేశం కాగానే సభాధ్యక్ష స్థానంలో ఉన్న తెదేపా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్.. బిల్లులను ప్రవేశపెట్టడానికి అనుమతించారు. కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ప్రవేశపెట్టారు. చర్చ లేకుండానే అది ఆమోదం పొందింది.

ఈ పార్లమెంటు సమావేశాల్లో మొత్తం 11 బిల్లులను ప్రవేశపెట్టగా 9 చర్చల్లేకుండానే ఆమోదం పొందాయి.

**మేం గోల్‌పోస్టు మార్చలేదు: ఖర్గే**

తాము గోల్‌పోస్టును మార్చలేదని, మొదటి నుంచీ ఒకే డిమాండ్లకు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులపై పోలీసుల దాష్టీకానికి అమిత్ షా సమాధానం చెప్పాలని, అయోధ్య చందాల చోరీపై ప్రధాని సమాధానం కోరుతున్నామని పేర్కొన్నారు. మూడోది ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండు చేస్తున్నామని స్పష్టం చేశారు.

**ఖర్గే నుంచి ఒత్తిడి: సీపీ రాధాకృష్ణన్**

ఖర్గే నుంచి తరచూ ఒత్తిడి ఎదుర్కొంటున్నానని రాజ్యసభ ఛైర్‌పర్సన్ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మంగళవారం సభలో రామ మందిర విరాళాల చోరీపై చర్చను తిరస్కరిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**సభల బయట..**

పార్లమెంటు ప్రధాన ద్వారంవద్ద అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి పోటాపోటీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. రెండు వర్గాల మధ్య భద్రతా సిబ్బంది అడ్డుగా నిల్చున్నారు.

లైబ్రరీ నుంచి మకరద్వారం వరకూ ఎన్డీయే ఎంపీలు ర్యాలీ నిర్వహించారు.

ఝార్ఖండ్‌లో పోలీసు చర్యపై ఎన్డీయే నిరసన వ్యక్తం చేయగా.. రామ మందిర విరాళాల చోరీపై ఇండియా కూటమి ఆందోళన నిర్వహించింది.



## కశ్మీరీ పండిట్‌లకు ఉగ్ర హెచ్చరికలు..
# అప్రమత్తమైన ప్రభుత్వం

కశ్మీరీ పండిట్ ఉద్యోగులకు ఉగ్రబెదిరింపులు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని.. సురక్షిత ప్రాంతాల్లో సెలవుపై ఉండాలని వారికి సూచించింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబాతో కలిసి పని చేస్తున్న ఓ గ్రూప్ ఇటీవల బహిరంగ బెదిరింపు లేఖను విడుదల చేసింది. అందులో ప్రధానమంత్రి ప్రత్యేక ఉపాధి ప్యాకేజీ కింద కశ్మీర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన కొందరు పండిట్‌లను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. వారికి సంబంధించిన ఫొటోలు, పేర్లు, ఇతర వివరాలను కూడా అందులో పేర్కొంది.

దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం వందలాది మంది కశ్మీరీ పండిట్ ఉద్యోగులకు ఆగస్టు 25వ తేదీ వరకు సెలవులు మంజూరు చేసింది. బెదిరింపు లేఖలో పేర్లున్న వారందరినీ సురక్షితంగా జమ్మూకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. బెదిరింపులపై దర్యాప్తు కొనసాగుతోందని.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. కాగా 2022లోనూ ఉగ్రవాదులు కశ్మీరీ పండిట్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. ఆ దాడుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో తమను జమ్మూకు బదిలీ చేసి.. పోస్టింగ్ ఇవ్వాలని పీఎం ప్యాకేజీ ఉద్యోగులు ఏడు నెలల పాటు భారీ నిరసనలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం వారికి శ్రీనగర్, ఇతర ప్రధాన పట్టణాలలోని సురక్షితమైన ప్రదేశాల్లో పోస్టింగ్ ఇచ్చింది.

# 3700 మొబైల్ యాప్‌స్‌పై కేంద్రం నిషేధం..




సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే 3700లకు పైగా యాప్‌లపై నిషేధం విధించింది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లోక్‌సభకు వెల్లడించింది. వేటు పడిన వాటిల్లో మోసపూరిత రుణ యాప్‌లు కూడా ఉన్నట్లు తెలిపింది.

''జూన్ 30, 2026 నాటికి మొత్తం 3,718 మొబైల్ అప్లికేషన్లను దేశంలో నిషేధించాం. అనుమానాస్పద, నేరపూరిత కార్యకలాపాల్లో పోలీసులు గుర్తించిన 15.75లక్షలకు పైగా సిమ్ కార్డులు, 5,77లక్షల ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేశాం. సైబర్ నేరాల కట్టడి కోసం ఏర్పాటు చేసిన 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'కు అందిన 32.80లక్షలకు పైగా ఫిర్యాదులను పరిష్కరించి రూ.11,158 కోట్లను నేరగాళ్ల చేతికి వెళ్లకుండా కాపాడాం'' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

చోరీ చేసిన డబ్బును తరలించేందుకు సైబర్ నేరగాళ్లు ఉపయోగిస్తోన్న మ్యూల్ ఖాతాలపైనా చర్యలు ముమ్మరం చేసినట్లు కేంద్రం తెలిపింది. ఈ ఏడాది జూన్ 30 నాటికి 32.08 లక్షల అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాలను గుర్తించి, రూ.25,698 కోట్ల విలువైన అక్రమ లావాదేవీలను అడ్డుకున్నామని పేర్కొంది. పలు ప్రభుత్వ ఏజెన్సీలు, సాంకేతిక సంస్థల సహకారంతో ఈ చర్యలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

ఆర్థిక మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లతో దోపిడీలు, సోషల్ మీడియా నేరాల వంటి వాటిపై ఫిర్యాదు చేసేందుకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని కేంద్రం ఈ సందర్భంగా మరోసారి వెల్లడించింది. 1930 హెల్ప్‌లైన్ నంబరుతోనూ పౌరులు ఈ సైబర్ మోసాల గురించి రిపోర్ట్ చేయొచ్చని తెలిపింది. ఇక, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్ఎంఎస్‌లు, టీవీ, రేడియో యాడ్స్, డిజిటల్ మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు సందేశాలు పంపిస్తున్నట్లు పేర్కొంది.

# మహిళా బిల్లుకు ఓకే.. డీలిమిటేషన్‌కు విజయ్ నో

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ''ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి'' అని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు.

మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం.



## విమానం గాల్లో ఉండగా ఇంజిన్ విఫలం..
## చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ

కోల్‌కతా నుంచి చెన్నై వస్తోన్న ఇండిగో విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైంది. విమానం గగనతలంలో ఉండగా.. ఇంజిన్ ఫెయిల్ అయింది . దాంతో చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి ఈ భయానక ఘటన చోటుచేసుకుంది.

224 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం కోల్‌కతా నుంచి చెన్నైకి బయల్దేరింది. రాత్రి 11.30కి అది గమ్యస్థానంలో దిగాల్సి ఉంది. విమానం ల్యాండింగ్‌కు సిద్ధమవుతోన్న తరుణంలో ఎడమవైపు ఇంజిన్ విఫలమైనట్టు పైలట్ గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు. దాంతో సురక్షిత ల్యాండింగ్ కోసం చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. అధికారుల అప్రమత్తతతో ఏడు నిమిషాల తర్వాత సురక్షితంగా విమానం దిగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మరో 10 నిమిషాల తర్వాత ఎమర్జెన్సీని ఉపసంహరించుకోవడంతో కార్యాకలాపాలన్నీ సాధారణ స్థితికి చేరుకున్నాయి.




## అణుశాస్త్రవేత్త, అక్షరాస్యత ఉద్యమరూపశిల్పి పరమేశ్వరన్ కన్నుమూత



ప్రముఖ అణుశాస్త్రవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ఎం.పి.పరమేశ్వరన్ (91) మంగళవారం త్రిస్సూర్‌లోని తన నివాసంలో వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. రచయితగా, సిద్ధాంతకర్తగా, పాపులర్ సైన్స్ ఉద్యమనేతగా, అక్షరాస్యత ఉద్యమ రూపశిల్పిగా ఆయన ప్రజలకు విశేష సేవలందించారు. 1935 జనవరి 18న కేరళలోని కిరలూర్‌లో జన్మించిన పరమేశ్వరన్ తిరువనంతపురం ఇంజినీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పట్టభద్రుడయ్యారు. 1957 నుంచి 1975 వరకు ముంబయిలోని భాభా అణు పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేశారు. కేరళ శస్త్ర సాహిత్య పరిషత్ స్థాపనలో కీలకపాత్ర వహించారు. సైన్స్, సామాజిక అంశాలపై ఆంగ్లం, మళయాళంలో 30కి పైగా పుస్తకాలు, వందల వ్యాసాలను వెలువరించారు. ఆయన ప్రతిపాదించిన 'ఫోర్త్‌వరల్డ్ థియరీ' వామపక్ష పార్టీల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఆలోచనలతో విభేదించిన సీపీఎం నేతలు పరమేశ్వరన్‌ను 2004లో పార్టీ నుంచి బహిష్కరించారు.

**తీరని లోటు: లక్ష్మణరెడ్డి**

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: డాక్టర్ పరమేశ్వరన్ మృతి తీరనిలోటని జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1990లలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమానికి, మద్యనిషేధ ఉద్యమానికి డాక్టర్ పరమేశ్వరన్ ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు.

## సుబ్బయ్యా.. మీ మనసు గొప్పదయ్యా!



'మనం పుట్టేటప్పుడు ఏమీ తీసుకురాం. వెళ్లేటప్పుడు ఏమీ తీసుకుపోం. అందుకు మనదగ్గర ఇప్పుడు ఉన్నది నలుగురికి ఉపయోగపడేలా పంచేద్దాం' అని గొప్పగా ఆలోచించినట్లున్నారు తమిళనాడుకు చెందిన విశ్రాంత ప్రైవేట్ ఉద్యోగి సుబ్బయ్య(82). ఈయనది మదురైలోని హార్విపట్టి. భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు పిల్లలు లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నారు. సుబ్బయ్య తన శరీరాన్ని ఇప్పటికే మదురైలోని ప్రభుత్వ రాజాజీ వైద్య కళాశాలకు దానం చేయగా.. ఇప్పుడు తన జీవితకాల పొదుపు రూ.60 లక్షల విలువైన నగదు, బంగారు నగలను సైనిక దళాల ఫ్లాగ్ డే ఫండ్ కోసం విరాళంగా ప్రకటించారు. ఆ మేరకు వీలునామా పత్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కృష్ణకు తాజాగా అందజేశారు.

## క్యాన్సర్‌ను నోటిఫైయబుల్ వ్యాధిగా ప్రకటించండి



**- 19 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం**

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్సలు అందించేందుకు గాను నివేదించదగిన వ్యాధి (నోటిఫైయబుల్ డిసీజ్)గా దానిని ప్రకటించాలని 19 రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఇప్పటికే 17 రాష్ట్రాలు క్యాన్సర్‌ను నివేదించదగిన వ్యాధిగా గుర్తించాయి. ఈ మేరకు పార్లమెంటు స్థాయీ సంఘం చేసిన సిఫార్సును అవి అమలు చేశాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా దీనిని అనుసరించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విషయంలో దేశవ్యాప్తంగా ఏకరూప విధానం అమలయ్యేలా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

**ఏ వయసు వ్యక్తి తప్పిపోయినా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి**

ఎవరైనా ఒక వ్యక్తి/వ్యక్తులు తప్పిపోయారని సమాచారం అందగానే పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసు, స్త్రీపురుషులనే దానితో సంబంధం లేకుండా అదృశ్యమైన వారి విషయంలో తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పింది. తాము గతంలో ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్న 'పర్సన్' అనే పదం పిల్లలకే పరిమితం కాదని తెలిపింది. అన్ని వయసుల వారికీ, బాలబాలికలు, స్త్రీపురుషులందరికీ వర్తిస్తుందని జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం పేర్కొంది. తమ ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కోర్టు ధిక్కార చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

## ఓటు తొలగించలేదు..
### ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై ఈసీ స్పందన



తన ఓటును తొలగించారంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై ఈసీ స్పందించింది. ఆయన ఓటును శాశ్వతంగా చిరునామా మారిన జాబితాలో చేర్చినట్లు ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో తెలిపింది. మరోవైపు ఆయన ఓటును తొలగించలేదని బెంగళూరు సెంట్రల్ సిటీ కార్పొరేషన్ స్పష్టం చేసింది. ఓటర్ ఐడీలో పేర్కొన్న చిరునామాలో ప్రస్తుతం ఆయన ఉండడం లేదని వెల్లడించింది. నిబంధనల ప్రకారం శాంతినగర్ నియోజకవర్గంలో ఆయన నమోదు చేసుకున్న అడ్రస్‌లో విచారణ చేయగా.. గత నాలుగు సంవత్సరాలుగా ప్రకాశ్ రాజ్ ఆ అపార్ట్‌మెంట్‌లో నివసించడం లేదని అక్కడి వారు ధ్రువీకరించారు. దీంతో ఆయన ఓటును 'షిఫ్టెడ్' (చిరునామా మారినవారు) జాబితాలో చేర్చినట్లు బెంగళూరు సెంట్రల్ సిటీ కార్పొరేషన్ తెలిపింది.

ఈ విషయమై అదనపు జిల్లా ఎన్నికల అధికారి జగదీష్ మాట్లాడుతూ.. ప్రకాశ్ రాజ్‌తో ఫోన్‌లో మాట్లాడగా.. ఆయన కూడా సదరు అపార్ట్‌మెంట్‌లో ఉండటం లేదని చెప్పారని, శాంతినగర్ నియోజకవర్గంలోనే వేరే ప్రాంతంలో నివసిస్తున్నారని తెలిపారని అన్నారు. ఆయన తన ప్రస్తుత నివాస చిరునామాతో ఫారమ్ 6తో ఓటరు జాబితాలో పేరును పునరుద్ధరించుకోవచ్చని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై ప్రకాశ్ రాజ్ చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

## దుస్తుల్లో ఫోన్.. పెన్‌డ్రైవ్: జైలు అధికారులకు చిక్కిన ప్రజ్వల్ రేవణ్ణ

ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారు. ప్రస్తుతం పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఆయన.. తన దుస్తుల్లో రహస్యంగా ఫోన్ దాచుకున్నట్లు క్రైమ్ బ్రాంచ్ అధికారులు గుర్తించారు. ఆయన వద్ద పెన్ డ్రైవ్ కూడా లభ్యమైనట్లు వెల్లడించారు. దీంతో ఎలక్ట్రానిక్ పరికరాలు జైలు లోపలికి ఎలా వచ్చాయనే దానిపై దర్యాప్తు చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు సీనియర్ జైలు అధికారిని సస్పెండ్ చేశారు. భద్రతా లోపాలపై వివరణ కోరుతూ జైలు సూపరింటెండెంట్ కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో హాసన సెక్స్ కుంభకోణం కర్ణాటకలో ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఓ మహిళ షాకింగ్ విషయాలు వెల్లడించింది. తన తల్లిపై కొన్నేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలాన్ని ఇచ్చింది. అనంతరం పలువురు మహిళలు కూడా ఆయనపై ఆరోపణలు చేశారు. విచారణలో ప్రజ్వల్ దోషిగా తేలడంతో కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడే రేవణ్ణ.




# అక్రమ రవాణా బాధితులకు ఏదీ భరోసా?

మానవ అక్రమ రవాణా అనేది ఒక గొలుసుకట్టు ప్రక్రియ. ఇందులో ఒక వ్యక్తిని గుర్తించడం, తరలించడం, ఒక చోట నిర్బంధించడం వంటివి ఉంటాయి. అవి బలవంతంగానో, మోసంతోనో, బాధితుల బలహీన పరిస్థితిని ఆసరాగా చేసుకునో సాగుతాయి. లైంగిక దోపిడీ, వెట్టిచాకిరీ, బానిసత్వం, బలవంతపు వివాహం, భిక్షాటన వంటి రూపాల్లో దోపిడీ చేయాలనే ఉద్దేశంతో జరుగుతాయి. అమెరికా 'ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్ 2025' నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు 2024లో 1,02,027 మంది బాధితులను గుర్తించాయి. దోషులుగా తేలిన వారి సంఖ్య కేవలం 7,975 మాత్రమే. జాతీయ నేరగణాంకాల సంస్థ 2024లో 2,135 మానవ అక్రమ రవాణా కేసులను నమోదు చేసింది. వీటిలో మొత్తం 6,018 మంది బాధితులు ఉండగా, 2,297 మంది చిన్నారులే. ఇవన్నీ అక్రమ రవాణా కేసులుగా అధికారికంగా నమోదైనవే.

**జవాబుదారీతనం కరవు**

భారతదేశంలో మానవ అక్రమ రవాణా నేరాన్ని రాజ్యాంగం, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ చట్టం, ఇతర చట్టాల్లోని వివిధ నిబంధనల కింద ప్రస్తావించారు. ఈ చట్టాలన్నీ తమవంతు పాత్ర పోషిస్తున్నా, నేర నివారణ నుంచి నేరస్థులపై విచారణ, శిక్ష విధింపు, బాధితుల పునరావాసం వరకు మొత్తం ప్రక్రియకు పూర్తి బాధ్యత వహించే సంస్థ ఒక్కటీ లేదు. దీనివల్ల జవాబుదారీతనం ఉండటం లేదు. అందుకని ఇండియాకు ఇప్పుడు అన్ని చర్యలను ఒకే వ్యవస్థ ద్వారా సమన్వయపరిచే సమగ్ర చట్టం కావాలి. అది అక్రమ రవాణాదారులను సమర్థంగా నిరోధించడమే కాకుండా, బాధితులు పునరావాసం పొందుతూ, సమాజంలో గౌరవప్రదంగా కలిసిపోయేదాకా అండగా నిలవాలి. మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసు, కార్మిక శాఖ, రైల్వేలు, స్థానిక సంస్థలు, న్యాయవ్యవస్థ అన్నీ కలిసి పనిచేయడం అవసరం. సమాజ భాగస్వామ్యమూ ముఖ్యమే. కుటుంబాలు, స్థానిక, పౌర సంస్థలన్నీ ఉమ్మడి బాధ్యతగా భావించాలి. ఇదంతా ఒక చిన్నారి అదృశ్యం కాకముందే మొదలవ్వాలి. చట్టం ప్రకారం మానవ అక్రమ రవాణా నేరం గురించి సమాచారం తెలిసిన ప్రతి వ్యక్తి, సమీపంలోని మేజిస్ట్రేట్‌కు లేదా పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలి. గ్రామపంచాయతీ సభ్యులు, గ్రామనివాసులకూ ఇది వర్తిస్తుంది. ఇదొక విధాన సూచన మాత్రమే కాదు, ఇప్పటికే అమల్లో ఉన్న చట్టబద్ధమైన బాధ్యత. ఇలాంటి బాధ్యత తమపై ఉందనే విషయమూ చాలామందికి తెలియదు. తెలిసినా పట్టించుకోని వారిని జవాబుదారీగా నిలబెట్టే పరిస్థితులూ లేవు. పాఠశాలలు సైతం ఒక చిన్నారి బడికి తరచుగా గైర్హాజరవుతున్న దశలోనే అప్రమత్తమై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న పిల్లలను స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తే, కుటుంబాల దగ్గరే సురక్షితంగా ఉండగలుగుతారు. పేదరికం కారణంగా అక్రమ రవాణాదారుల తప్పుడు హామీలను నమ్మి మోసపోకముందే వారికి ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు అందాలి. అక్రమ రవాణా జరిగే ప్రాంతాలు, రవాణా మార్గాలు, గమ్యస్థానాల వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలి.

బాధితులను రక్షించడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోకూడదు. దోపిడీ నుంచి బయటపడిన చిన్నారికి తగిన రక్షణ కల్పించకపోతే, మళ్లీ అక్రమ రవాణా ముఠాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకని, బాలల సంక్షేమ కమిటీలు వారికి వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పరిహారం దక్కేలా చర్యలు తీసుకోవాలి. బాధిత చిన్నారులు తిరిగి విద్యను కొనసాగించేలా, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి సాధించేలా సాయపడాలి. అయితే, అక్రమ రవాణాదారులు స్వేచ్ఛగా తిరుగుతున్నంత వరకు ఇవన్నీ ఆశించిన ఫలితాల్ని ఇవ్వవు. అందుకే ఫాస్ట్-ట్రాక్ కోర్టులు నిర్దిష్ట కాలవ్యవధిలోనే కేసుల విచారణను పూర్తి చేయాలి. ఆలస్యమయ్యేకొద్దీ బాధితుల మానసిక వేదన పెరుగుతుంది. బాధితులు, సాక్షులు బెదిరింపులకు గురయ్యే ప్రమాదం అధికమవుతుంది. సంఘటిత నేర ముఠాలు తమ కార్యకలాపాలను కొనసాగించడానికి ఇది అవకాశాన్ని కల్పిస్తుంది.

**ఆస్తులు జప్తు చేయాలి**

మానవ అక్రమ రవాణా నేరాన్ని ఎదుర్కొనే చర్యలు సరిహద్దులకు అతీతంగా ఉండాలి. ఇందుకోసం నిఘా సమాచార మార్పిడి, సంయుక్త దర్యాప్తులు, నిందితుల అప్పగింత, పరస్పర న్యాయ సహకారం, అక్రమ లావాదేవీలను గుర్తించే ఆర్థిక దర్యాప్తులు అవసరం. వీటితోపాటు, మానవ అక్రమ రవాణా నేరాల్లో దోషులుగా తేలిన వారి వివరాలతో ఒక అంతర్జాతీయ డేటా వ్యవస్థ ఉండాలి. దీనివల్ల ఒక దేశంలో చిన్నారిని అక్రమ రవాణా చేసిన వ్యక్తి, మరో దేశంలో అదే నేరాన్ని సులభంగా చేయలేడు. డబ్బు చెల్లించేందుకు కొనుగోలుదారులు, లాభపడాలనే స్వార్థపరులు సిద్ధంగా ఉండటం వల్లే వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ కొనసాగుతోంది. ఈ నేరంలో డబ్బు చెల్లించే కస్టమర్ కూడా భాగస్వామే. ఇంత పెద్ద గొలుసులో ఒక వ్యక్తిని మాత్రమే అరెస్టు చేయడంకంటే, మొత్తం నేర ముఠాను ఛేదించి, దానిద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులను జప్తు చేస్తేనే ఫలితం ఉంటుంది. దీనివల్ల వ్యవస్థీకృత మానవ అక్రమ రవాణాపై తీవ్రమైన దెబ్బ పడుతుంది. ప్రతి చిన్నారి చట్ట పరిరక్షణలో సురక్షితంగా ఎదుగుతున్నాడా, సంఘటిత నేర ముఠాలు వారిని చేరకముందే రక్షణ వ్యవస్థలు అండగా నిలుస్తున్నాయా అనేదాని ఆధారంగానే నిజమైన అభివృద్ధి చెందిన భారతాన్ని కొలవాలి.

# పెట్టుబడుల నుంచి ఉపాధి వైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథం

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతి కొత్త అవకాశాల దశలోకి ప్రవేశిస్తోంది. పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల విస్తరణ, సాంకేతిక రంగం, పునరుత్పాదక ఇంధనం, పోర్టులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయి. ఇప్పుడు ఈ పెట్టుబడులను స్థిరమైన ఉపాధి, ఆదాయ వృద్ధిగా మార్చడం తదుపరి కీలక లక్ష్యం కావాలి.2026 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, గత రెండేళ్లలో సుమారు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు ఆకర్షించగా, వాటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాల అవకాశాలు ఏర్పడనున్నాయని అంచనా. ఈ స్థాయి పెట్టుబడి ఆసక్తి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సామర్థ్యంపై పెరుగుతున్న విశ్వాసానికి సంకేతం. అయితే పెట్టుబడి ప్రతిపాదన, అవగాహన ఒప్పందం, భూమిపైకి వచ్చిన ప్రాజెక్టు, ప్రారంభమైన పరిశ్రమ, వాస్తవ ఉద్యోగం—ఇవన్నీ ఒకే దశలు కావు. అందువల్ల భవిష్యత్తు కార్యాచరణలో ప్రతి దశకు స్పష్టమైన కొలమానాలు అవసరం.**



ఇటీవల విశాఖ ఆర్థిక ప్రాంతాన్ని సుమారు రూ.9.5 లక్షల కోట్ల ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా అభివృద్ధి చేయడానికి సూక్ష్మస్థాయి ప్రణాళికలపై దృష్టి పెట్టడం కూడా ఈ దిశలో ముఖ్యమైన అడుగు. తయారీ, సమాచార సాంకేతిక రంగం, ఔషధాలు, పర్యాటకం, లాజిస్టిక్స్ వంటి రంగాలను సమన్వయపరిస్తే ఒక పెద్ద పరిశ్రమ చుట్టూ అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పడి పరోక్ష ఉపాధిని కూడా పెంచే అవకాశం ఉంటుంది.

విశాఖలో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక పర్యావరణం విస్తరిస్తుండటానికి మరో ఉదాహరణగా రూ.1,008 కోట్ల లాజిస్టిక్స్, తేలికపాటి పారిశ్రామిక పార్కు ద్వారా సుమారు 5,000 ఉద్యోగాలు ఏర్పడతాయని అంచనా వేయబడింది. ఇలాంటి ప్రాజెక్టుల చుట్టూ స్థానిక సరఫరా సంస్థలు, నిర్వహణ సేవలు, రవాణా, ఆహార సేవలు, గృహ నిర్మాణం వంటి అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఇక్కడే నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం లభిస్తుంది. పరిశ్రమ స్థాపనకు ముందుగానే ప్రతి జిల్లాలో రాబోయే పెట్టుబడులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, కళాశాలలు, పరిశ్రమలు కలిసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలి. "పరిశ్రమ వస్తుంది—శిక్షణ ఇస్తాం" అనే విధానానికి బదులుగా "పరిశ్రమ రాకముందే నైపుణ్యం సిద్ధం" అనే విధానం యువతకు మరింత ప్రయోజనకరం.

అదే సమయంలో పెద్ద పెట్టుబడులతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు బలమైన అనుసంధానం కల్పించాలి. ఒక భారీ పరిశ్రమకు సరఫరా చేసే స్థానిక సంస్థలు పెరిగితే పెట్టుబడి ప్రభావం ఒక ఉద్యోగంతో ఆగకుండా అనేక కుటుంబాలకు విస్తరిస్తుంది. అందువల్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తదుపరి కొలమానం కేవలం ఎంత పెట్టుబడి వచ్చింది? అనేది కాకుండా ఎంత పెట్టుబడి కార్యరూపం దాల్చింది? ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి? ఎన్ని స్థానిక ఉద్యోగాలు వచ్చాయి? యువత ఆదాయం ఎంత పెరిగింది? అనే ప్రశ్నలు కావాలి.

పెట్టుబడి మూలధనాన్ని తెస్తుంది. పరిశ్రమ ఉత్పత్తిని పెంచుతుంది. కానీ ఉపాధి కుటుంబ ఆర్థిక భద్రతను పెంచుతుంది. అందుకే ఆంధ్రప్రదేశ్ లక్ష్యం పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదగడమే కాకుండా, నైపుణ్యవంతమైన యువతకు నాణ్యమైన ఉద్యోగాల గమ్యస్థానంగా నిలవడం కావాలి

**(సీహెచ్. ప్రతాప్)**

# బీజేపీలో ఎంత కలవరాన్ని సృష్టించిందో!

**నేటి యువతరం తప్పుదారి పట్టలేదు. దిశానిర్దేశం లేకుండా వారు వ్యవహరించడంలేదు. వారితో చర్చించాలి కానీ వారిని నియంత్రించకూడదు. నిబంధనల్ని కాదు, కారణాల్ని వారు అడుగుతారు. వివరణలు కోరతారు. జిజ్ఞాస వారి లక్షణం. తిరుగుబాటు వారి స్వభావం'.. ఈ మాటలన్నది ఏ కమ్యూనిస్టు నాయకుడో కాదు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్. జూలై 24న అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన విశ్వ మాంగల్య సభలో ఆయన ఆ మాటలు అంటున్న సమయంలో.. అక్కడికి ఒక కిలోమీటర్ దూరంలో, జంతర్ మంతర్ వద్ద దెబ్బతిన్న యువ సమూహం ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తోంది. సరిగ్గా 24 గంటల అనంతరం కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. 'ఆలస్యమైనా చివరకు మంచి పనిచేశారు..' అని 92 ఏళ్ల మురళీమనోహర్ జోషీ వ్యాఖ్యానించారు. భాగవత్ ప్రకటన చేయడానికి ఒక రోజు ముందే, విద్యార్థులపై లాఠీచార్జి దారుణమని ఆ కురు వృద్ధుడు వ్యాఖ్యానించారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల ఆందోళన న్యాయసమ్మతమేనని కూడా జోషీ సమర్థించారు.**



ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే యువత నుంచి వచ్చిన ఒత్తిడి మాత్రమే కాదు, బీజేపీ, సంఘ్‌లో అంతర్గత శక్తుల నుంచి వచ్చిన ఒత్తిడి కూడా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైనట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్ వద్ద జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన ప్రదర్శన తీవ్రత ఆలస్యంగానైనా బీజేపీలో ఎంత అంతర్గత కలవరాన్ని సృష్టించిందో కూడా అర్థమవుతోంది. తన ఆమరణ నిరాహార దీక్ష ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకు బలం చేకూర్చిన లద్దాఖ్ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఒకప్పుడు మోదీ సమర్థకుడు. ఆర్టికల్ 370 రద్దు చేసి, లద్దాఖ్‌ను జమ్మూ-కశ్మీర్ నుంచి వేరు చేసినప్పుడు ఆయన హర్షాతిరేకంతో ఉప్పొంగిపోయారు. లద్దాఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేరుస్తామని బీజేపీ హామీ ఇచ్చినప్పుడు ఆయన బీజేపీకి అనుకూలంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. రాహుల్‌గాంధీ భారత జోడో యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఆహ్వానాన్ని కూడా వాంగ్‌చుక్ తిరస్కరించారు. అలాంటి వ్యక్తిని బీజేపీ వ్యతిరేకంగా మార్చుకుంది. ఆయనే కాదు, జంతర్ మంతర్‌కు వచ్చిన యువతీ యువకుల్లో ఒకప్పుడు మోదీని, బీజేపీని అభిమానించి తర్వాత వ్యతిరేకంగా మారిన వారెందరో ఉన్నారు. 'నేను కూడా నా తల్లిదండ్రులతో కలిసి మోదీకి ఓటు వేశాను. ఢిల్లీలో జంతర్ మంతర్ ప్రదర్శనకు వస్తుంటే వారు ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు' అని ఒక యువతి చెప్పింది.

అనేకమంది కేంద్ర మంత్రులు, ఎంపీల ఇళ్లలో కూడా వారి పిల్లలు సీజేపీ ప్రదర్శనకు సంఘీభావం ప్రకటించారని బీజేపీ నేతలే అంటున్నారు. జంతర్ మంతర్ ప్రదర్శనలో పంజాబ్, ముంబై, హరియాణా, తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాల నుంచి ఇంజనీర్లు, ఫ్యాషన్ డిజైనర్లు, ఎంబీఏ, లా విద్యార్థులు, రైతు కుటుంబాల పిల్లలు అనేకమంది కనపడ్డారు. లూజ్ జీన్స్, టీషర్టులు, రకరకాల వస్త్రధారణ, నెత్తికి చుట్టుకున్న బ్యాండ్లతో ఉన్న వీరిని ఏ రాజకీయ పార్టీతోనూ అంటగట్టలేము.

ఈ విద్యార్థులే ఇవాళ పార్లమెంటు అజెండాను నిర్ణయిస్తున్నారంటే ఆశ్చర్యం కలుగుతోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమయిన తర్వాత ఏడు రోజులకు మొదటిసారి మంగళవారం మధ్యాహ్నం నుంచి లోక్‌సభ సజావుగా సాగింది. అందుకు కారకులు విద్యార్థులే. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి, ప్రతిపక్షాలు కూడా చివరకు చర్చకు సిద్ధపడడానికి వారే కారకులు. స్మృతి ఇరానీ నుంచి ధర్మేంద్ర ప్రధాన్ వరకు మోదీ హయాంలో నలుగురు విద్యామంత్రులు మారారు. ప్రతి విద్యామంత్రి హయాంలో ఏదో ఒక వివాదం ఉంటూనే వచ్చింది. కానీ విద్యార్థుల ఒత్తిడి మేరకు రాజీనామా చేయక తప్పని పరిస్థితి ఒక్క ధర్మేంద్ర ప్రధాన్‌కే ఏర్పడింది. రాజీనామా చేసిన తర్వాత పార్లమెంటు ఆవరణలో ధర్మేంద్ర అడుగుపెడితే బీజేపీ ఎంపీలు ఆయనకు జిందాబాద్ అంటూ ఘనస్వాగతం పలికారు. కిరీటం తొడిగారు. దేనికి? ఎవరి ఆదేశాలతో ఎందుకు సన్మానం చేశారు? కింద పడ్డా తమదే పై చేయి అని చెప్పుకునేందుకే ఆ పని చేసినట్లు స్పష్టమవుతోంది. దానివల్ల నష్టం ఎవరికి? వారికే కాదూ!

నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. పార్లమెంటుకు ఊరేగింపుగా వెళ్లి లాఠీచార్జిలకు తలలు పగిలి, పెల్లెట్ల ముక్కలు ఆ యువజనుల శరీరాల్లోకి చొచ్చుకుపోయినప్పుడు అనేకమంది తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సీజేపీలో ఉన్నవారే సంఘ వ్యతిరేక శక్తులైతే, వారి ప్రతినిధులతో కేంద్రమంత్రులు మూడు దఫాలు ఎందుకు చర్చలు జరిపారు? విద్యావ్యవస్థలో సంస్కరణలపై వారితో కూడా చర్చిస్తామని ఎందుకు వాగ్దానం చేశారు?

నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. జయప్రకాశ్ నారాయణ్ నిర్వహించిన సంపూర్ణ క్రాంతి ఉద్యమంలో కూడా డైనమైట్లతో రైల్వే వంతెనలు పేల్చివేసేందుకు కుట్ర జరిగిందని ఆరోపణలు వచ్చాయి. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమ సమయంలో కూడా హింసాకాండ చెలరేగింది. చాలాసార్లు పోలీసుల దమనకాండ జరిగిన తర్వాత దాన్ని సమర్థించుకునేందుకు ఈ సంఘ వ్యతిరేకుల కోణం ముందుకు వస్తుంది. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. ప్రతి నిరసనను నేరంగా చిత్రించడం కొంతకాలం వరకు చెల్లుతుందేమో కానీ అన్ని సమయాల్లోనూ చెల్లదు. నిరసన తెలిపేవారి ఆగ్రహాన్ని గౌరవించడం అధికార వ్యవస్థలో ఉన్నవారు నేర్చుకోవాలి. లేకపోతే పాలనా వ్యవస్థలపై శాశ్వత వ్యతిరేకత ఏర్పడుతుంది. మోహన్ భాగవత్ ఆలస్యంగానైనా చేసిన వ్యాఖ్యల్లో ఈ వివేచన కనపడుతోంది.

అసలు కాంగ్రెస్ సరిగా వ్యవహరించి ఉంటే విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ బలంగా గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతాయనగా రాహుల్‌లో మళ్లీ చలనం వచ్చింది. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. ఎన్నికల రాజకీయాల్లో కానీ, ప్రభుత్వ వైఖరిలో కానీ ఏ మార్పు వచ్చింది? కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయింది?

పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టినంత మాత్రాన విద్యావ్యవస్థలో మార్పులు వస్తాయని చెప్పడానికి వీలు లేదు. కొత్త ఐఐటీలు, మెడికల్ కాలేజీలు తెరిచినంత మాత్రాన ఉన్నత విద్యారంగంలో నాణ్యత మెరుగుపరచలేము. ఇవాల్టికీ ప్రపంచంలోని అత్యుత్తమ వంద యూనివర్సిటీల్లో ఏ ఒక్క భారతీయ విశ్వవిద్యాలయానికీ స్థానం లేదు. ప్రతి ఏటా కేంద్ర బడ్జెట్ పరిమాణం విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, గత 12 సంవత్సరాల్లో కేంద్ర బడ్జెట్‌లో విద్యకు లభిస్తున్న వాటా గణనీయంగా తగ్గింది. 2013-14లో మొత్తం కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 4.65 శాతం కేటాయించగా, 2025-26 నాటికి ఆ వాటా 2.5 శాతానికి పడిపోయింది. విద్యకే కాదు, పరిశోధనకు కూడా దేశంలో ప్రాధాన్యం తగ్గిపోతోంది. కాంగ్రెస్ హయాంలో విద్యా ప్రమాణాలపై, విద్యా సంస్థల్లో సౌకర్యాలపై, ఉన్నత విద్యకూ, ఉపాధికీ సంబంధం లేకపోవడంపై మురళీమనోహర్ జోషీ, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్, నరేంద్రమోదీ తదితర బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారని చరిత్రపుటల్లోకి వెళితే తెలుస్తుంది. మరి ఇప్పుడు పరిస్థితి ఎంత మేరకు మారింది? అనేకసార్లు పరీక్ష పత్రాలు లీక్ అయినప్పటికీ విద్యార్థులు వీధిలోకి వస్తే కానీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టాలన్న ఆలోచన ముందే ఎందుకు రాలేదు? 2024లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటేకానీ కొన్ని పరీక్ష కేంద్రాల్లో తిరిగి పరీక్షను నిర్వహించలేదు. ఇప్పుడు మొత్తం పరీక్షలనే రద్దు చేయాల్సి వచ్చింది. పైగా తాము ఆగమేఘాలపై కట్టుదిట్టంగా పరీక్షలను సరిగా నిర్వహించడమే ఘనకార్యంగా ప్రచారం చేసుకుంటున్నారు. పేపర్ లీక్ కాకుండా పరీక్షలను సరిగా నిర్వహించామని ఎన్నికల ప్రణాళికలో చెప్పుకునే రోజులు కూడా వస్తాయేమో!

2047 నాటికి వికసిత్ భారత్ సాధించేవరకు ఉన్న మధ్య కాలాన్ని అమృతకాలంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ అమృత కాలంలోనే బొద్దింకల దండు నిరసన తెలపడం ఒక రకంగా ప్రభుత్వానికి కనువిప్పు కలిగేందుకు జరిగిన శుభపరిణామంగా భావించాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. బహుశా ఈ విషయం గ్రహించినందువల్లనేనేమో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనికి ఎన్టీఏ పరీక్షల సంస్కరణలపై టాస్క్‌ఫోర్స్ చైర్మన్ బాధ్యతలు అప్పజెప్పారు. ఆయన నాయకత్వంలోనే యూపీఏ హయాంలో అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థగా నిలిచిన ఆధార్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. దేశంలో ప్రస్తుతం కనపడుతున్న డిజిటల్ పరివర్తనలో ఆయన కీలకపాత్ర పోషించారు. సాంకేతిక నిపుణులకు, మేధావులకు పార్టీలతో ప్రమేయం ఉండదు. అందుకే మోదీ ఆయనకు కీలక బాధ్యతలు అప్పజెప్పారు. ఇదే దిశలో ప్రభుత్వం ముందుకు సాగుతూ ఎప్పుడూ రాజకీయాలపైనే కాక, పాలనా వ్యవస్థలో కీలక మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటే హర్షించని వారుండరు. మరో మూడేళ్లలో ఇలాంటి మధ్యంతర దిద్దుబాటు చర్యలు (మిడ్ కోర్స్ కరెక్షన్) తీసుకునేందుకు అవకాశం ఉన్నది. అలా జరగకపోతే నష్టపోయేది అధికారపక్షమే.

# అసహాయులకు పునర్జన్మనిద్దాం!

**మరణించిన తరవాతా మరికొన్నేళ్లు బతికేందుకు వీలుకల్పించే అద్భుత మార్గం అవయవదానం. సాటి మనుషులకు ఎవరైనా చేయగలిగిన అత్యున్నత ఉపకారమూ అదే. కేంద్రం తీసుకున్న ప్రత్యేక చొరవవల్ల గడిచిన రెండున్నరేళ్లలో ఆ మహత్కార్యానికి అయిదు లక్షల మందికి పైగా స్వచ్ఛందంగా సమ్మతించారు. ఆ విధంగా మానవతాదీపాన్ని దేదీప్యం చేయడానికి ముందుకొచ్చిన ఆ దయాళువులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కానీ, అదే సమయంలో జీవన్మృతుల అవయవదానాలు మాత్రం మన దేశంలో చాలా తక్కువగా ఉంటున్నాయి. 2024లో దేశీయంగా సుమారు 19వేల అవయవ మార్పిళ్లు జరిగితే, అందులో జీవన్మృతుల వాటా 18శాతమే. బ్రెయిన్ డెడ్ అయినవారి ఆర్గాన్ డొనేషన్‌కు కుటుంబ సభ్యులను ఒప్పించడంలో యంత్రాంగం ఒకవైపు వెనకబడుతుంటే- మరోవైపు కీలక అవయవాల వైఫల్యంతో ప్రాణాపాయ పరిస్థితుల్లో చిక్కుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. లాన్సెట్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ప్రకారం 2021లో గుండె మార్పిడి అవసరమైన వారిలో కేవలం 0.2శాతం మందే ఆ శస్త్రచికిత్సకు నోచుకున్నారు. మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయాలు దెబ్బతిన్నవారిలోనూ చాలామందికి ఆ అవయవాలు సమకూరలేదు. జీవించిఉన్నవారి అవయవదానాల్లో ప్రపంచంలోనే ముందున్న ఇండియా- జీవన్మృతుల నుంచి ఆర్గాన్ డొనేషన్ల సంఖ్యను పెంచగలిగితే అసహాయ రోగులెందరికో మేలు జరుగుతుంది.**

ప్రతి పదిలక్షల జనాభాకు మరణానంతర అవయవదానాలు స్పెయిన్‌లో దాదాపు 50 ఉంటే అమెరికా, పోర్చుగల్‌లలో 30కి పైగా, ఫ్రాన్స్, యూకే వంటిచోట్ల 20కి మించి నమోదవుతున్నాయి. ఇండియాలో మాత్రం అవి ఒకటికన్నా తక్కువకే పరిమితమవుతున్నాయి. శ్రీలంక, థాయ్‌లాండ్, చైనా, జపాన్‌లతో పోల్చినా ఈ విషయంలో మన దేశం చాలా వెనకబడింది. పరిశీలనల ప్రకారం దేశవ్యాప్తంగా ఏడాదికి దాదాపు రెండు లక్షల మూత్రపిండ మార్పిళ్లు అవసరమవుతున్నాయి. 2024లో అందులో ఏడు శాతం శస్త్రచికిత్సలే జరిగాయి. కాలేయం, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించి కూడా వాస్తవ ఆవశ్యకతతో పోలిస్తే ట్రాన్స్‌ప్లాంట్లు పదిశాతానికి మించట్లేదు. అవయవదాతల కోసం ఎదురు చూస్తూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్న వారికి కొత్త జీవితాలను ప్రసాదించాలంటే వ్యవస్థాగతంగా చేయాల్సిన కృషి చాలా ఉంది. మన దేశంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రతి సంవత్సరం లక్షన్నర మందికిపైగా మరణిస్తున్నారు. బాధిత కుటుంబసభ్యుల అంగీకారంతో ఆ మృతుల్లో కొందరి అవయవాలనైనా సేకరించగలిగితే ఎందరో నిర్భాగ్యులకు పునర్జన్మ లభిస్తుంది. ఇలాంటి ప్రయత్నాలు చురుగ్గా సాగకపోవడం వల్లే అవయవాలతో అమానుష వ్యాపారం చేసే కిరాతకులకు అవకాశం చిక్కుతోంది. దానివల్ల పేదసాదల బతుకులు అంధకారంలోకి జారిపోతున్నాయి. జీవనశైలిలో వచ్చిన మార్పులతో కొన్నేళ్లుగా మధుమేహం, బీపీ, ఒబెసిటీ కోరచాస్తున్నాయి. వాటికితోడు నొప్పి నివారణ మందుల విపరీత వినియోగం, కట్టుతప్పుతున్న వాయుకాలుష్యం, హెపటైటిస్ వంటి వాటివల్ల కిడ్నీలు, ఊపిరితిత్తులు, గుండె, కాలేయ వైఫల్యాలు అధికమవుతున్నాయి. చిన్నపిల్లలతో పాటు యువతలోనూ ఈ సమస్యలు ముమ్మరిస్తున్నాయి. అలాంటి అభాగ్యులకు కొత్త ఊపిరి పోయాలంటే బ్రెయిన్‌డెడ్ కేసులను సత్వరం గుర్తించి, సంబంధిత బంధుమిత్రులను అవయవదానం దిశగా చైతన్యపరచాలి. అందుకోసం అన్ని ఆసుపత్రుల్లో ప్రత్యేక నిపుణుల్ని అందుబాటులో ఉంచాలి. జీవన్మృత అవయవ దాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో అవయవ మార్పిడికి అధునాతన మౌలిక వసతుల్ని ఏర్పాటు చేయాలి. ఆర్గాన్ డొనేషన్‌పై భయ సందేహాలు, మూఢనమ్మకాల్ని రూపుమాపుతూ, అవయవదానం గొప్పదనంపై మారుమూల ప్రాంతాల్లోనూ విస్తృతంగా అవగాహన కల్పించాలి.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసిన మంత్రి పి.నారాయణ

- రాజధాని ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- విశాఖలో ప్రపంచ ఏనుగుల దినోత్సవ జాతీయ స్థాయి వేడుకకు హాజరుకావాల్సి ఉందన్న ఉప ముఖ్యమంత్రివర్యులు
- రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో వేడుక నిర్వహిస్తున్నట్టు వెల్లడి
- స్వయంగా కేంద్ర మంత్రికి ఆహ్వానం పలికిన అంశాన్ని ప్రస్తావించిన పవన్ కళ్యాణ్

విజయవాడ ఆగస్టు 12 అనంత జనశక్తి న్యూస్



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గురువారం రాజధాని అమరావతి వేదికగా జరగనున్న సీడ్ యాక్సెస్ రోడ్డు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల నివాస సముదాయాలు తదితర అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రివర్యులను ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రెండు స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్డు ఫేజ్ -2 పనుల ప్రారంభోత్సవం కూడా జరగనున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నందుకు నారాయణని ఉప ముఖ్యమంత్రివర్యులు అభినందించారు. గురువారం విశాఖపట్నం వేదికగా ముందుగా నిర్ణయమైన జాతీయ స్థాయి ప్రపంచ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో తాను పాల్గొనాల్సి ఉందని పవన్ కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహించాలన్న తన అభ్యర్ధన మేరకు ఈ కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహిస్తున్నట్టు, తన ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి కేంద్ర అటవీ, పర్యావరణ మరియు వాతావరణ మార్పుల శాఖ మంత్రి bభూపేందర్ సింగ్ యాదవ్ హాజరుకానున్న విషయాన్ని తెలిపారు.రాష్ట్రంలో జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. రాజధాని అమరావతి అభివృద్ధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రివర్యులు, ఈ ప్రాజెక్టు ద్వారా రాజధాని అభివృద్ధి మరింత వేగం పుంజుకోవాలని ఆకాంక్షించారు

# రెడ్డిపల్లి అభివృద్ధికి రూ.7.70 కోట్లతో రహదారి పనులు

- కూటమి ప్రభుత్వంలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

బనగానపల్లె ఆగస్టు 12 (అనంత జనశక్తి న్యూస్):



రెడ్డిపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం రెడ్డిపల్లిలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.రెడ్డిపల్లి గ్రామంలో ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.7.70 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. అలాగే రూ.1.17 కోట్లతో సీసీ రహదారులు, గ్రామ పంచాయతీ భవనం నిర్మించినట్లు చెప్పారు. గతంలో రైతుల కోసం రూ.2 కోట్లతో 16 మోరీలు, గ్రావెల్ రోడ్లు, రూ.70 లక్షలతో రహదారులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. పింఛన్ల పెంపు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం 2 పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో పౌష్టికాహారం అందిస్తున్నామని, అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాయలసీమ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం 16 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు కల్పించిందని, గత ఐదేళ్లలో వైసీపీ ఒక్క డీఎస్సీ ఉద్యోగమైనా ఇచ్చిందా అని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు.తనపై మాజీ ఎమ్మెల్యే చేస్తున్న విమర్శలు, రాజీనామా డిమాండ్లపై స్పందిస్తూ ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ఎవరి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలిచి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కోరారు.



# రోడ్డెక్కడం కాదు.. అసెంబ్లీకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి.. ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదు.'' అని అన్నారు. "ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో.. నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలి'' అని అన్నారు.

ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి స్పష్టం చేశారు. "రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు. జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారి దగ్గర ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలి. ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు'' అని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మెగా డీఎస్సీని పూర్తి చేయలేకపోయిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని వైసీపీ పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. "ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు... ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. మీ దగ్గర ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది'' అని అన్నారు.


మెగా డీఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం మీదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని అనిత పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ.. కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. "ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు. నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉంది'' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, పరిష్కారం సాధ్యమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వినతులు స్వీకరిస్తున్నారని హోంమంత్రి తెలిపారు. వినతి తీసుకోవడంతోనే బాధ్యత పూర్తయినట్లు కాదని, సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ బాధితులకు సాధ్యమైనంత త్వరగా న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పేర్కొంటూ పలువురు బాధితులు హోంమంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ వ్యవహారంలో దాదాపు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అనిత తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించిందని, వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

# మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్, ఆగస్టు 12, అనంతజనశక్తి న్యూస్

మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు అప్పగించే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ఈ నిర్ణయం ఉందని కొనియాడారు. మహిళా సంఘాల సాధికారతకు సీఎం నిర్ణయం మరో ముందడుగని ప్రశంసించారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. మహిళా సంఘాలకు మిల్లింగ్‌లో అవకాశం కల్పించినందుకు మహిళల తరుపున మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ కేంద్రాల ఏర్పాటుతో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. మిల్లింగ్, ధాన్యం నిల్వ రంగాల్లో మహిళా సంఘాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సీఎం నిర్ణయంతో గ్రామీణ మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మరింత పెరుగుతాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు.




# 'ఆంధ్రప్రదేశ్ ఫర్ సేల్' కొత్త పీపీపీ పాలసీ ఇలాగే ఉంది

అమరావతి, ఆగస్ట్ 12, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పీపీపీ (పీపీపీ) పాలసీపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు చేశారు. కొత్త పాలసీని చూస్తుంటే 'ఆంధ్రప్రదేశ్ ఫర్ సేల్' అన్నట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తూ, చివరకు ఆ భారాన్ని ప్రజలపైనే మోపే విధంగా విధానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రాజెక్టులకు ప్రభుత్వం ఇస్తుందని, ప్రైవేట్ సంస్థలు తీసుకునే రుణాలకు వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని జగన్ ఆరోపించారు.

రాయితీలు కూడా ప్రభుత్వం ఇవ్వడంతో పాటు, ప్రైవేట్ సంస్థలు ప్రజల నుంచి యూజర్ ఛార్జీలు వసూలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారని విమర్శించారు. తాగునీరు, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు వంటి ప్రజా సేవలను కూడా PPP పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం చూస్తోందని జగన్ అన్నారు. అన్నింటినీ ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఇక ప్రభుత్వం ఉండేది ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజా సేవల బదులు స్కాంలు చేసి లూటీ చేయడానికే మిగులుతుందా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

నిరసనలపై కేసులు.. కోర్టులను ఆశ్రయిస్తాం

డీఎస్సీ, రైతుల సమస్యలు, PPP, దిశ చట్టం రద్దు, బీసీ నాయకులపై కేసులు వంటి అంశాలను జగన్ ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు చేస్తున్నా కేసులు పెట్టి అణచివేస్తున్నారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపే స్వాతంత్ర్యం కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామనే కక్షతో అన్యాయమైన కేసులు పెడుతున్నారని జగన్ అన్నారు. ఈ అణచివేతపై కచ్చితంగా కోర్టులను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

బీసీ నాయకులపై అక్రమ కేసులంటూ ఆరోపణలు

బీసీ నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని జగన్ ఆరోపించారు. జరగని ఘటనను జరిగినట్లుగా వక్రీకరించి చింతాడ రవిపై అక్రమ కేసు పెట్టి అరెస్టు చేశారని అన్నారు. కేసుల కోసం దొంగ సాక్ష్యాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ముస్తఫా, విరూపాక్షి, కారుమూరు సునీల్‌పైనా తప్పుడు, అక్రమ కేసులు పెట్టారని జగన్ పేర్కొన్నారు. ప్రశ్నించే వారందరిపైనా తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావు

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి ప్రస్తుతం ఖాళీగా ఉందని జగన్ తెలిపారు. త్వరలో ఆ పదవి భర్తీ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో వైసీపీ తరఫున తూమాటి మాధవరావును డిప్యూటీ చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. మాధవ్‌కు పార్టీ ఎమ్మెల్సీలంతా పూర్తి మద్దతు ఇవ్వాలని సూచించారు. ఆయన ఎన్నిక సాఫీగా జరిగేలా సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని జగన్ పిలుపునిచ్చారు.

చంద్రబాబు వైట్ పేపర్లపై జగన్ విమర్శలు

చంద్రబాబు విడుదల చేస్తున్న వైట్ పేపర్లన్నీ వాస్తవానికి 'ఎల్లో పేపర్లు', అబద్ధాల పత్రాలని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఆ పత్రాల్లోని అబద్ధాలను ఆధారాలు, సాక్ష్యాలతో ఇప్పటికే బయటపెట్టామని తెలిపారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అందిస్తామని చెప్పారు. వైసీపీ ఏ అంశాన్ని మాట్లాడినా సాక్ష్యాలు, ఆధారాలు, సోర్స్‌తో మాట్లాడుతుందని జగన్ అన్నారు. తాను అయినా, పార్టీ నాయకులు అయినా ప్రతి అంశానికి మూలాలను చూపిస్తారని తెలిపారు. చంద్రబాబు మాత్రం తాను చెప్పే అంశాలకు సోర్స్ చెప్పరని విమర్శించారు. 'వెన్నుపోటు పార్టీ' అబద్ధాలు చెప్పడంలో ముందుంటుందని, కల్లార్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబుకు సాటి ఎవరూ లేరని జగన్ వ్యాఖ్యానించారు. అదే స్థాయిలో అబద్ధాలు చెప్పేలా లోకేష్‌కు కూడా శిక్షణ ఇచ్చారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఆధారాలతో మాట్లాడాలని నేతలకు సూచన

పార్టీ నేతలు ఎవరూ ప్రిపరేషన్ లేకుండా మాట్లాడవద్దని జగన్ సూచించారు. పూర్తిగా కసరత్తు చేసి మాట్లాడితేనే విషయం ప్రజలకు బలంగా చేరుతుందని అన్నారు. కంటెంట్ అత్యంత ముఖ్యమని, ప్రతి అంశాన్ని ఆధారాలు, సాక్ష్యాలతో వివరించాలని సూచించారు. ఏ అంశంపై ఎవరు మాట్లాడాలో ముందుగానే నిర్ణయించి, సంబంధిత నేతలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని జగన్ దిశానిర్దేశం చేశారు. ప్రజలకు వాస్తవాలను స్పష్టంగా వివరించేలా పార్టీ నాయకులు వ్యవహరించాలని అన్నారు.

ఏ వర్గమూ సంతృప్తిగా లేదు: జగన్

రాష్ట్రంలో ఉద్యోగులతో సహా ఏ వర్గమూ సంతృప్తిగా లేదని జగన్ ఆరోపించారు. గతంలో అమలు చేసిన పథకాలను రద్దు చేసి, కొత్త పథకాలను మోసాలుగా మార్చారని విమర్శించారు. మహిళలకు అందించే సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశారని అన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత.. ఇలా ఏ వర్గమూ సంతోషంగా లేదని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని, వాటిలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. ఇందుకు సంబంధించిన గణాంకాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని అన్నారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణపై విమర్శలు

ప్రభుత్వ రంగ సంస్థలపైనా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీని కూడా ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా సేవలను ప్రైవేట్ రంగానికి అప్పగించడం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగే ప్రమాదం ఉందని జగన్ పేర్కొన్నారు. PPP విధానం, ప్రజా సేవలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, ఉద్యోగులు, బీసీ నాయకులపై కేసులు, నిరసనల అణచివేత వంటి అంశాలపై వైసీపీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని జగన్ స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై మరింత గట్టిగా పోరాడాలి

ప్రజా సమస్యలపై గతంలో మాదిరిగానే ఇకపై కూడా మరింత గట్టిగా పోరాడాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పార్టీ శాసనసభాపక్ష సభ్యులకు పిలుపునిచ్చారు. రానున్న అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలకు పార్టీ సభ్యులంతా పూర్తి సన్నద్ధంగా ఉండాలని సూచించారు. అయితే, వైసీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని జగన్ ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పిస్తే సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాల్సి వస్తుందని, ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి సభలో మాట్లాడే సమయం హక్కుగా లభిస్తుందని తెలిపారు. ఆ హక్కును ఇవ్వడం చంద్రబాబుకు ఇష్టం లేకపోవడం వల్లే వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని జగన్ వ్యాఖ్యానించారు. దీంతో అసెంబ్లీలో పార్టీ తరఫున చేయగలిగింది పరిమితంగా ఉంటోందని అన్నారు.



ప్రెస్‌మీట్ల ద్వారా ప్రజలకు సమాధానం

అసెంబ్లీలో ప్రభుత్వం ప్రస్తావించే అంశాలకు ఆధారాలు, సాక్ష్యాలతో తాను ప్రెస్‌మీట్లు నిర్వహిస్తానని జగన్ తెలిపారు. ప్రతి అంశంలోనూ ప్రజలకు నాణేనికి రెండోవైపు చూపిస్తామని చెప్పారు. ప్రభుత్వం సభలో ఏ అంశాన్ని ప్రస్తావించినా దానికి సంబంధించిన వాస్తవాలను ఆధారాలు, సాక్ష్యాలతో ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# లుంగీవాలా వ్యాఖ్యలు

**పార్లమెంట్‌ను కుదిపేసిన బీజేపీ ఎంపీ**
**దక్షిణాది సభ్యుడిపై అనుచిత భాష**
**ఎంపీ జాన్ బ్రిట్టాస్‌పై వ్యాఖ్యలు**
**సభాహక్కుల నోటీసు ఇచ్చిన సీపీఎం నేత**
**తీవ్రంగా స్పందించిన రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్**

న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్

పార్లమెంట్‌లో 'లుంగీవాలా వ్యాఖ్యలు' తీవ్ర కలకలం రేపుతున్నాయి. సీపీఐ (ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ తనను బీజేపీ ఎంపీ సుష్మితా దేవ్ 'లుంగీవాలా' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ రాజ్యసభలో తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టిన జాన్ బ్రిట్టాస్.. దక్షిణాది వ్యక్తిగా తన ఆహార్యం తనకు ఎంతో గర్వకారణమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు వేదికగా ఓ ప్రాంతాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమమని అన్నారు.

తాను ఓ రోజు సభలో మాట్లాడుతుంటే లుంగీవాలా అంటూ నన్ను ఉద్దేశించి అమర్యాదకర వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ ఎంపీ పేర్కొన్నారు. ''నేను ధోతీలో ఉన్నా. మలయాళీని, దక్షిణాది వ్యక్తిని అయినందుకు గర్వపడుతున్నాను.. కానీ, తమ సంస్కృతి పట్ల అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై సభ దృష్టి సారించాలి. ఆమెకు వ్యతిరేకంగా ప్రివిలెజ్ మోషన్‌ను ప్రవేశపెట్టాను.. ఆమెపై నాకు ఎటువంటి ద్వేషం లేదు' అని ఎంపీ బ్రిట్టాస్ తెలిపారు. అయితే, తన బాధ్యతలు నిర్వర్తించనీయకుండా బీజేపీ ఎంపీ పదే పదే అడ్డుపడ్డారని ఆయన ఆరోపించారు. పలుసార్లు 'లుంగీవాలా' అని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని తెలిపారు.

దీనిపై కేంద్ర మంత్రి, బీజేపీ సభాపక్ష నేత జేపీ నడ్డా స్పందిస్తూ.. లుంగీ కామెంట్స్‌ను తాము సమర్థించమని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అభ్యంతరాలు, తమ పార్టీ ఎంపీ వ్యాఖ్యలు అన్నీ రికార్డుల్లోకి చేరాయని ఆయన అన్నారు. సుస్మితా దేవ్‌కు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. అంతేకాదు, అది తమ దృష్టిలో ధోతీ అని తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 'సభకు సభ్యులందరూ సమానమే.. ఒక సభ్యుడిపై ఆరోపణలు వచ్చాయి.. కాబట్టి వారికీ తమ వివరణ ఇచ్చేందుకూ అవకాశం ఇస్తున్నాం.. సభా గౌరవానికి భంగం కలిగించేది ఏదైనా జరిగితే చైర్మన్ వారిని తన ఛాంబర్‌కు పిలిపించి వాదనలు వినొచ్చు ' అని అన్నారు.

**సభలో చోటుచేసుకున్న పరిణామాలపై రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. సభ్యులు హుందాగా ప్రవర్తించాలని, ప్రాంతీయ భావోద్వేగాలను గౌరవించాలని కోరారు. "గౌరవ సభ్యులు సభలో ఒక సభ్యుడు ప్రసంగిస్తున్నప్పుడు ఇతర సభ్యులు జోక్యం చేసుకుంటూ మర్యాదలేకుండా, అనుచిత వ్యాఖ్యలు చేసిన కొన్ని సంఘటనలు నా దృష్టికి వచ్చాయి. గౌరవ సభ్యులు తోటి సభ్యుల మనోభావాలను , సెంటిమెంట్లను దెబ్బతీసేలా ప్రవర్తించకుండా జాగ్రత్త వహించాలి" అని వ్యాఖ్యానించారు.**



# సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో డీఎంహెచ్ఓ తనిఖీ

- వైద్య సేవల నాణ్యతపై డీఎంహెచ్ఓ ఆరా
- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12, అనంత జనశక్తి

న్యూస్ సింగరేణి ప్రధాన ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ తుకారాం రాథోడ్ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పిల్లల వార్డు, ప్రసూతి వార్డు, శస్త్రచికిత్సల వార్డు, ఐసీయూ, పురుషుల వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే విభాగం, టీకాల విభాగం తదితర విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత, పారిశుధ్యం, రోగులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి, శిశు వైద్యం, శస్త్రచికిత్సలు తదితర సేవల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, నాగభూషణం, రాంప్రసాద్‌తో పాటు సింగరేణి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీపీఎస్ నుంచి రూ.95.90 లక్షల సీఎస్ఆర్ నిధులు



- పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో మౌలిక వసతులకు ఊతం
- అభివృద్ధి పనులకు కేటీపీఎస్ రూ.2.39 కోట్ల కేటాయింపు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12, అనంత జనశక్తి న్యూస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్ 7వ దశ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న పనులకు సంబంధించి రూ.95,90,802ల మూడో, తుది విడత నిధుల చెక్కును కేటీపీఎస్ 7వ దశ చీఫ్ ఇంజినీర్ బి. శివరామ్‌రెడ్డి జిల్లా కలెక్టర్ అంకిత్‌కు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్ యు. గోపతి పాల్గొన్నారు. కేటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో పాల్వంచలోని ఇందిరానగర్ నుంచి జగన్నాథపురం వరకు సెంట్రల్ లైటింగ్, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం రూ.2,39,70,802 నిధులను కేటాయించారు. ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు, విద్యుత్ వెలుగులు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

కొందరు నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి డబ్బులు బదిలీ చేయిస్తున్నారు. మరికొందరు ఉద్యోగాలు, రుణాలు, బహుమతులు, పెట్టుబడుల పేరుతో ప్రజలను ఆకర్షిస్తున్నారు. వాట్సాప్, ఎస్ఎంఎస్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనుమానాస్పద లింకులే వారి ప్రధాన ఆయుధాలుగా మారాయి. ఒక్కసారి లింక్‌పై క్లిక్ చేయడంతో ఫోన్‌లోని సమాచారం నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉంది. అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేయించడం ద్వారా ఫోన్‌ను తమ నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదు. బ్యాంకు సిబ్బంది ఎవరూ ఫోన్‌లో ఓటీపీ లేదా పిన్ అడగరనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి. అదేవిధంగా కస్టమర్ కేర్ పేరుతో వచ్చే ప్రతి ఫోన్‌ను నమ్మడం ప్రమాదకరం. సెర్చ్ ఇంజిన్‌లో కనిపించే నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా కూడా పలువురు మోసపోతున్నారు. అత్యవసరంగా డబ్బులు పంపాలని, ఖాతా నిలిచిపోతుందని చెప్పడం మోసగాళ్ల సాధారణ వ్యూహంగా మారింది. అనుమానం కలిగించే ఫోన్‌కాల్స్, సందేశాలు వస్తే వెంటనే స్పందించకుండా ముందుగా నిజానిజాలు నిర్ధారించుకోవాలి. ఎవరైనా బెదిరించినా భయపడకుండా సంబంధిత సంస్థ అధికారిక నంబర్ ద్వారా వివరాలను తెలుసుకోవాలి. ఆన్‌లైన్ లావాదేవీల కోసం ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తూ బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించాలి. ప్రతి ఖాతాకు ఒకే పాస్‌వర్డ్ ఉపయోగించకుండా వేర్వేరు పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం మంచిది. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, గుర్తింపు పత్రాల ఫొటోలను బహిరంగంగా ఉంచకూడదు. మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా బ్యాంకును సంప్రదించి లావాదేవీలను నిలిపివేయడానికి ప్రయత్నించాలి. అదేవిధంగా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్‌లో సైబర్ నేరాల ఫిర్యాదు నమోదు చేసే అవకాశాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలి. మోసపోయిన తర్వాత బాధపడటం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండటం ఎంతో ముఖ్యం. కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి అనుమానాస్పద లింక్ వెనుక ప్రమాదం ఉండొచ్చనే భావనతో వ్యవహరించాలి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మన అప్రమత్తతే సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేయగలదు. డిజిటల్ లావాదేవీలు సులభతరం చేస్తున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అదే సాంకేతికత ఆర్థిక నష్టానికి కారణమవుతుంది. ప్రజల అవగాహన, బ్యాంకుల భద్రతా చర్యలు, పోలీసుల నిఘా కలిసినప్పుడే సైబర్ నేరాలను సమర్థంగా అడ్డుకోవచ్చు. "ఓటీపీ లేదు.. పిన్ లేదు.. అనుమానాస్పద లింక్‌కు క్లిక్ లేదు" అనే నియమాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలి. జాగ్రత్తగా ఉండటం.. వెంటనే స్పందించడం.. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడం ఇవే ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణకు ప్రధాన మార్గాలు.



# తాలిపేరు ప్రాజెక్టులో నీటి లభ్యతపై కలెక్టర్ ఆరా

- ఏకలవ్య పాఠశాలలో విద్యా ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీ
- విద్యార్థుల విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12, అనంత జనశక్తి :



చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు, ఏకలవ్య మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తాలిపేరు ప్రాజెక్టును సందర్శించిన ఆయన నీటిమట్టం, ఇన్‌ఫ్లో, నీటి విడుదల, ప్రాజెక్టు నిర్వహణ, సిబ్బంది వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లని అధికారులు తెలిపారు. బుధవారం సుమారు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్, గేట్లు, డ్యామ్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఏకలవ్య మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల విద్యాబోధన, హాజరు, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలును పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో మందుల నిల్వ, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.
వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, సాంకేతిక సహకారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పర్యటనలో చర్ల తహసీల్దార్, ఇరిగేషన్, విద్యాశాఖ, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అటవీ ఉద్యోగి నవీన్‌కు ఘన నివాళి







- నవీన్ కుటుంబానికి అటవీ శాఖ అండగా ఉంటుంది: జిల్లా అటవీ అధికారి
- అక్రమ విద్యుత్ ఉచ్చులపై కఠిన చర్యలు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 12, అనంత జనశక్తి న్యూస్ :

విధి నిర్వహణలో అక్రమ విద్యుత్ ఉచ్చుకు బలై ప్రాణాలు కోల్పోయిన అటవీ ఉద్యోగి బి. నవీన్‌కు జిల్లా అటవీ శాఖ ఘన నివాళి అర్పించింది. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఉదయం నుంచి అంతిమ కార్యక్రమం పూర్తయ్యే వరకు సిబ్బందితో కలిసి ఉండి వారికి మనోధైర్యం కల్పించారు. నవీన్ పార్థివదేహాన్ని సహచర సిబ్బందితో కలిసి భుజాన మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. నవీన్ కుటుంబానికి అటవీ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా అటవీ అధికారి భరోసా ఇచ్చారు. అటవీ సిబ్బంది ఒకే కుటుంబమని, విధి నిర్వహణలో ఒకరు ప్రాణాలు కోల్పోతే ఆ బాధ మొత్తం శాఖదేనని పేర్కొన్నారు. నవీన్ త్యాగం అటవీ శాఖలో ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. నవీన్ అంతిమయాత్రలో స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, పాల్వంచ అటవీ అధికారి, అటవీ పరిధి అధికారి, అటవీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రబాబు, సంఘం నాయకులు, అటవీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

# గోదావరి జలాలను గరిష్ఠస్థాయిలో వినియోగించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అలా స్వాధీనం చేసుకున్న మిల్లులను, అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు (మహిళా సంఘాలకు) అప్పగించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు కీలక సూచన చేశారు. మిల్లర్ల నుండి బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా పక్కా విధానాన్ని (పాలసీ) రూపొందించాలని, దీనిపై త్వరలోనే కేబినెట్ సబ్ కమిటీలో చర్చించి ఆమోదిస్తామని స్పష్టం చేశారు.

**మహిళా సంఘాల ఆధ్వర్యంలో 100 ఎకరాల్లో మోడల్ గోడౌన్లు**


ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, ప్రాథమికంగా 5 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా సంఘాల ద్వారా 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో భారీ గోడౌన్ల నిర్మాణాన్ని చేపడతారు. ఈ గోడౌన్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గోడౌన్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షించేందుకు ప్రతీ జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించారు.





# రూ.90 లక్షలు అప్పుచేసి ఇల్లు కొనుగోలు

- లోన్ రాక దంపతుల ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు
- ఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడి కారణంగా
- భర్త ఉరి వేసుకోగా.. భార్య పురుగుల మందు తాగి



హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్

సొంతిల్లు కట్టుకోవాలి, కొనుక్కోవాలి అనేది ప్రతీ ఒక్కరి కల. అది పల్లె అయినా పట్టణమైనా.. మనకంటూ ఓ గూడు ఉండాలి అని జీవితాంతం కష్టపడుతూ ఉంటారు. అలా సొంతింటి కలతో తీసుకున్న భారీ అప్పు ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆర్థిక ఇబ్బందులు, తీవ్రమైన అప్పుల ఒత్తిడి కారణంగా నిజామాబాద్ నగరంలో ఓ జంట బలవన్మరణానికి పాల్పడింది. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో వారికి పుట్టిన ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం నాగంపేట్‌కు చెందిన శేషాల నరేశ్.. నిజామాబాద్ కోటగల్లికి చెందిన మేఘనకు 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నరేశ్ తండ్రి మృతి తర్వాత కారుణ్య నియామకం కింద విద్యుత్ శాఖలో ఉద్యోగంలో చేరారు. ఇటీవల జూనియర్ అసిస్టెంట్ హోదాకు పదోన్నతి పొందిన ఆయన.. నిజామాబాద్ రూరల్ ఈఆర్వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.
సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో నరేశ్ గతేడాది సుమారు రూ.90 లక్షల అప్పు చేసి ఒక ఇంటిని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే తీసుకున్న అప్పును బ్యాంకు హోమ్‌లోన్ ద్వారా తీర్చేయాలని భావించినప్పటికీ.. ఆశించిన రీతిలో రుణం మంజూరు కాలేదు. దీంతో అప్పులు అలాగే ఉండిపోయాయి. అప్పులు ఇచ్చిన వారి నుంచి తీవ్ర ఒత్తిడి పెరగడంతో చివరకు కొనుగోలు చేసిన ఇంటిని విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. వచ్చిన మొత్తంతో కొంతమేర బకాయిలు చెల్లించినప్పటికీ ఇంకా అప్పులు మిగలడంతో నరేశ్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది.
ఈ క్రమంలో ప్రస్తుతం వినాయక్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న దంపతులు.. మంగళవారం విషాదకర నిర్ణయం తీసుకున్నారు. నరేశ్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. మరో గదిలో మేఘన పురుగుల మందు సేవించిన స్థితిలో కనిపించారు. కుటుంబ సభ్యులు గమనించి వారిని ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మేఘన తల్లి ఫోన్ చేసిన సమయంలో కుమార్తె సరిగా మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చింది. కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి తలుపు తీయాలని కోరినా స్పందన లేకపోవడంతో కిటికీ ద్వారా లోపలికి వెళ్లి చూడగా ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వారి ఇంట్లో లభించిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడే తన నిర్ణయానికి కారణమని నరేశ్ పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. పిల్లల భవిష్యత్తును జాగ్రత్తగా చూసుకోవాలని.. తమపై ఉన్న కోపాన్ని చిన్నారులపై చూపవద్దని అందులో కోరినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషాద ఘటనతో చిన్నారుల భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు ఆ ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారడంతో స్థానికులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

# ఫ్రీగా నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

- అభ్యర్థులకు సర్కార్ గుడ్‌న్యూస్
- మొత్తం 200 సీట్లలో 100 మంది అబ్బాయిలు
- 100 అమ్మాయిలకు ట్రైనింగ్2

హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్

వైద్య విద్యలో ప్రవేశం పొందాలనే లక్ష్యంతో నీట్ 2027కు సిద్ధమవుతున్న తెలంగాణ విద్యార్థులకు మంచి అవకాశం అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీవీసడబ్ల్యూఆర్ఈఐఎస్) వచ్చే ఏడాది నిర్వహించనున్న నీట్ యూజీ పరీక్ష కోసం ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్ అందించనుంది. అర్హత ఉన్న విద్యార్థులు ఆగస్ట్ 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సంస్థ కార్యదర్శి కంభంపాటి శారద తెలిపారు. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ ప్రత్యేక కోచింగ్ కార్యక్రమంలో మొత్తం 200 మంది విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. ఇందులో 100 మంది అబ్బాయిలు, మరో 100 మంది అమ్మాయిలకు సీట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని చిలుకూరు టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సీవోఈలో అబ్బాయిలకు.. మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సీవోఈలో అమ్మాయిలకు ఉచిత నీట్ శిక్షణ అందించనున్నారు. 202526 విద్యా సంవత్సరంలో ఏదైనా కాలేజీలో ఇంటర్మీడియట్ బైపీసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఈ ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే నీట్ 2026 పరీక్షకు హాజరైన అభ్యర్థులకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ అధికారిక వెబ్‌సైట్ నుంచి నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుని.. దాన్ని పూర్తిగా నింపిన తర్వాత అవసరమైన ధ్రువపత్రాలను జత చేసి.. సంబంధిత జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (డీసీఓ) ద్వారా నిర్దేశించిన కేంద్రాల్లో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అబ్బాయిలకు సంబంధించిన దరఖాస్తులను చిలుకూరు కేంద్రంలో.. అమ్మాయిల దరఖాస్తులను మహేంద్రహిల్స్ కేంద్రంలో సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ నీట్ ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల నుంచి ఎలాంటి అప్లికేషన్ ఫీజు వసూలు చేయడం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ఇందులో ఎంపికైన 200 మంది అభ్యర్థులకు ఉచిత వసతితోపాటు.. నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన కోచింగ్ అందించనున్నట్లు వెల్లడించారు. వైద్య విద్యలో సీటు సాధించాలనుకునే అర్హులైన విద్యార్థులకు ఈ అవకాశం ఎంతో ఉపయోగపడనుందని చెప్పారు.


గురువారం | రంగారెడ్డి
13.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం





# చెట్టు భంగిమలో చేసే వృక్షాసనం.. ఈ సులువైన ఆసనం చేస్తే ఒత్తిడి తగ్గి స్థిరత్వం పెరుగుతుంది

కొన్ని ఆసనాలు వేయడం కష్టంగా ఉంటుంది. కానీ వృక్షాసనం మాత్రం వేయడం చాలా సులువు. ఒక కాలు మీద నిలబడి చేసే ఈ ఆసనం వేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఎవరైతే స్థిరత్వం తక్కువగా ఉండి ఇబ్బంది పడుతున్నారో వారు ఈ ఆసనాన్ని అలవాటు చేసుకోండి. ఇది ఒత్తిడి తగ్గించడంతోపాటు మీలో ఆలోచనలు స్థిరంగా ఉండేలా చూస్తుంది.




**స్థిరత్వం ఎందుకు అవసరం?**

ఒక మనిషికి స్థిరత్వం చాలా అవసరం. లేకుంటే ఒక పని మీద లేదా ఒక ఆలోచన మీద దృష్టి నిలబడదు. ఆలోచనల్లో స్థిరత్వం ఉంటేనే మనసు ప్రశాంతంగా ఉంటుంది. లేకుంటే మనసులో గందరగోళంగా కలత చెందినట్టు అనిపిస్తుంది. లక్ష్యంపై దృష్టి సారించడం కష్టంగా మారుతుంది. అందుకే స్థిరమైన ఆలోచనలు కావాలంటే ముందు మీ మనసును స్థిరంగా ఉంచుకోవాలి. అందుకు వృక్షాసనం అవసరం. ఇది ఎంతో అద్భుతంగా పనిచేస్తుంది.


**వృక్షాసనం ఉపయోగాలు**

వృక్షాసనం వేయడం వల్ల మీ శరీరంలో కూడా సమతుల్యత పెరుగుతుంది. శరీరంలోని అవయవాల మధ్య సమతుల్యత మెరుగుపడుతుంది. అలాగే దృష్టిని మెరుగుపరిచేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. శ్వాసను నియంత్రించడంలో వృక్షాసనం అద్భుతంగా పనిచేస్తుంది. కాళ్ల కండరాలను బలపరచడానికి కూడా ఉపయోగపడుతుంది.




వెన్నెముక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు వృక్షాసనం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఎవరైతే ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారో వారి ప్రతిరోజూ వృక్షాసనం వేయడానికి ప్రయత్నించండి. ఇది ఒత్తిడిని తగ్గించి ప్రశాంతమైన జీవితాన్ని అందిస్తుంది. అయితే వృక్షాసనం వెన్నుముక గాయం తగిలిన వారు, మోకాళ్ళ గాయం ఉన్నవారు మాత్రం చేయకూడదు. ఇది ఆ సమస్యను మరింత పెంచే అవకాశం ఉంటుంది.

**వృక్షాసనం ఎలా వేయాలి?**



వృక్షాసనం వేయడం చాలా సులువు. ముందుగా ఒక చోట స్థిరంగా నిల్చోవాలి. ఒంటి కాలు మీద నిలబడి ఒక కాలును మరొక కాలుపై చిత్రంలో చూపించినట్టు పెట్టాలి. చేతులు పైకి లేపి అరచేతులను కలిపి ఉంచాలి. ఆ భంగిమలో ఎక్కువసేపు ఉండడానికి ప్రయత్నించాలి. ఇలా చేయడం వల్ల మీకు శ్వాసపై నియంత్రణ కలుగుతుంది. శ్వాసకోశ సమస్యలు కూడా చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుంది. ఈ వృక్షాసనం వేయడం సులువే. కాబట్టి అన్ని వయసుల వారు వేయవచ్చు.



# పిల్లల్ని కనాలనుకుంటున్నారా? అయితే ఈ రోజు నుంచే మునక్కాడలు తినడం ప్రారంభించండి





కేవలం దక్షిణ భారతదేశంలోనే కాదు భారతదేశమంతటా మునక్కాయలకు అభిమానులు ఉన్నారు. కూరలు, సాంబార్లలో అధికంగా వాడతారు. ఉల్లిపాయ, టమాటా, మునక్కాడలు వేసే వంటకానికి తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది ఫిదా అయిపోయారు. మునక్కాడలు తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ముఖ్యంగా వేసవిలో మీరు వీటిని కచ్చితంగా తినాలి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని కాపాడతాయి.

**మునక్కాయలు ఎందుకు తినాలి?**

కేవలం మనమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది ఎన్నో దేశాల వారు మునక్కాయలను తమ ఆహారంలో భాగం చేసుకున్నారు. వీటిని తినడం వల్ల శరీరం నుండి వ్యర్థాలు విషాలు బయటికి తొలగిపోతాయి. మునక్కాడలో క్లోరోఫిల్స్, థియోసైనేట్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కాలేయం, రక్తం నుంచి విషాన్ని తొలగించి బయటికి పంపిస్తాయి. అలాగే శరీరంలో పేరుకుపోయిన లోహాలను హారికరమైన రసాయనాలను కూడా బయటికి పంపుతాయి. కాబట్టి మీరు తరచూ మునక్కాయలను తినాల్సిన అవసరం ఉంది.

రోజువారీ ఆహారంలో మునక్కాయలను చేర్చుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. మీరు కాలేయాన్ని కాపాలనుకుంటే మునక్కాయలతో పాటు ఆ మునక్కాయల్లోని గింజలను కూడా తినేందుకు ప్రయత్నించండి. మునగకాయల్లో కాల్షియం, ఇనుము, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి.



ఇవన్నీ కూడా ఎముకలను బలోపేతం చేస్తాయి. మునక్కాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. మహిళలు ఆస్ట్రియాపోరోసిస్ వంటి సమస్యల బారిన పడకుండా ఉండాలంటే మునగకాయలను తినేందుకు ప్రయత్నించాలి.

**పిల్లల్ని కనాలనుకుంటే తినండి**

ఆయుర్వేద వైద్యంలో కూడా మునగను ఉత్తమ ఆహారంగా చెబుతారు. మునగకాయలో పాలిఫెనాల్స్ ఉంటాయి. ఇవి మనిషి పునరుత్పత్తి ఆరోగ్యానికి ఎంతో మంచిది. ముఖ్యంగా పురుషులు మునక్కాయలు తినాల్సిన అవసరం ఉంది. ఇవి తినడం వల్ల వారిలో వీర్య నాణ్యత మెరుగుపడుతుంది. పిల్లలను కనేందుకు ప్లాన్ చేసుకుంటున్న వారు... వారంలో నాలుగైదు సార్లు మునక్కాయలను తినడం వల్ల వారిలో సంతానోత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. అలాగే లైంగిక సామర్థ్యం కూడా పెరుగుతుంది.



శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు కూడా మునక్కాడలను తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. దీర్ఘకాలికంగా వారు పడుతున్న ఇబ్బందిని మునక్కాడలు తగ్గిస్తాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియాల్ సమ్మేళనాలు వీటిలో అధికంగా ఉంటాయి. అవి ఉబ్బసం, బ్రాంకైటిస్ వంటి సమస్యల నుండి కాపాడతాయి. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన శ్లేష్మాన్ని కూడా తొలగిస్తాయి.

డయాబెటిస్ వారు కూడా మునక్కాడలను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిలో ఉండే గుణాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెరగకుండా అడ్డుకుంటాయి. వీటిలో బయోయాక్టివ్ ప్లాంట్ సమ్మేళనాలు ఉంటాయి. కాబట్టి చక్కెర శోషణను నెమ్మదించేలా చేస్తాయి. ఇన్సులిన్ సున్నితత్వాన్ని కూడా మెరుగుపరుస్తాయి. కాబట్టి టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు మునక్కాడలను వారంలో నాలుగైదు సార్లు తినేందుకు ప్రయత్నించండి.

**మానసిక ఆరోగ్యానికి కూడా**

మునక్కాయలు చేసే మేలు ఎంతో. ఎందుకంటే ఈ మునక్కాయల్లో ట్రిప్టోఫాన్ అనే ఆమ్లం ఉంటుంది. ఇది ముఖ్యమైన అమైనో ఆమ్లం. దీన్ని తినడం వల్ల సంతోషకర హార్మోన్ అయిన సరటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీనివల్ల నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. కాబట్టి సంతోషంగా జీవించాలంటే మునక్కాయలను ఆహారంలో భాగం చేసుకోండి.



## 'చిరు లీక్స్' మరోసారి వైరల్.. మెగాస్టార్ 158వ సినిమాకు టైటిల్ ఇదే, టీజర్ రిలీజ్ డేట్ కూడా ఫిక్స్!



మెగాస్టార్ చిరంజీవి మరోసారి తనదైన స్టైల్లో 'చిరు లీక్స్'కు తెరతీశారు. సాధారణంగా తన సినిమాలకు సంబంధించిన కీలక విషయాలను చిత్రబృందం అధికారికంగా ప్రకటించేలోపే సరదాగా లీక్ చేస్తూ అభిమానుల్లో ఆసక్తిని పెంచే చిరంజీవి.. తాజాగా మరోసారి అదే పని చేశారు. ఈసారి తన 158వ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను స్వయంగా బయటపెట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సరదా సంభాషణలో తన కొత్త సినిమా టైటిల్‌ను రివీల్ చేశారు. దీంతో మెగా అభిమానుల్లో ఒక్కసారిగా సందడి నెలకొంది.

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం చిరంజీవి కెరీర్‌లో 158వ సినిమాగా రూపొందుతోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ కాంబినేషన్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమాకు 'కదిరి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు చిరంజీవి స్వయంగా వెల్లడించారు. ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించకముందే చిరంజీవి లీక్ చేయడంతో 'చిరు లీక్స్' హ్యాష్‌ట్యాగ్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో లీక్స్ గురించి ప్రస్తావన వచ్చిన సమయంలో సంగీత దర్శకుడు తమన్ సరదాగా స్పందించారు. ఈ క్రమంలో టీజర్ మ్యూజిక్ పూర్తయిందా? టీజర్ చివరలో 'కదిరి' అనే టైటిల్‌ను చూపించారా? అంటూ చిరంజీవి ప్రశ్నించారు.

అయితే అక్కడే అసలు విషయం బయటపడింది. చిరంజీవి నోటి నుంచి 'కదిరి' అనే టైటిల్ రావడంతో అభిమానులు, మీడియా ప్రతినిధులకు సినిమా టైటిల్‌పై క్లారిటీ వచ్చేసింది. దీంతో ఈ లీక్‌కు సంబంధించిన వీడియోలు, కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టైటిల్‌తో పాటు సినిమాకు సంబంధించిన మరో కీలక అప్‌డేట్ కూడా వెలుగులోకి వచ్చింది. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న 'కదిరి' టీజర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో మెగా అభిమానులు ఈ టీజర్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.చిరంజీవి బర్త్‌డే సందర్భంగా టీజర్ రిలీజ్ కానుండటంతో సినిమాకు భారీ స్థాయిలో ప్రమోషన్స్ మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. టీజర్‌లో చిరంజీవి లుక్, పాత్ర స్వభావం, కథకు సంబంధించిన ఏమైనా క్లూస్ ఇస్తారా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. 'కదిరి'లో చిరంజీవి సరసన ప్రియమణి కథానాయికగా నటిస్తున్నారు. దీంతో పాటు కన్నడ నటి రచితా రామ్, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఛాంపియన్' ఫేమ్ అనశ్వర రాజన్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నారు. ఆమె చిరంజీవి మేనకోడలి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

## నేనంటే అతనికి పిచ్చి.. హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్‌పై మల్లికా షెరావత్ హాట్ కామెంట్స్!



బాలీవుడ్ హాట్ బ్యూటీ మల్లికా షెరావత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం కానున్న పాపులర్ రియాలిటీ షో 'ది ట్రైటర్స్ సీజన్ 2' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆగస్టు 13 నుంచి ఈ షో స్ట్రీమింగ్ కానున్న నేపథ్యంలో, షోకి సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ ప్రోమోలు, విశేషాలు బయటికి వస్తున్నాయి. ఈ షోలో పాల్గొన్న మల్లికా షెరావత్.. హాలీవుడ్ స్టార్ హీరో టామ్ క్రూజ్‌తో తనకున్న పరిచయం గురించి సంచలన విషయాలు వెల్లడించారు. షోలో భాగంగా తోటి కంటెస్టెంట్ మల్లికా షెరావత్‌ను ఉద్దేశించి, 'మీకు ఎప్పుడైనా ఎవరి మీదైనా క్రష్ ఉందా? లేక అందరికీ మీపైనే క్రష్ ఉందా?' అని ప్రశ్నించారు. దీనికి మల్లికా బదులిస్తూ, 'అందరికీ నాపైనే క్రష్ ఉంది. ఇటీవల కాలంలో హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్ కూడా నాపై మనసు పారేసుకున్నారు. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉంటే ఆయన పంపిన వీడియోలను కూడా చూపించేదాన్ని,' అంటూ ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆయన ఎలాంటి వీడియోలు పంపుతారని తోటి కంటెస్టెంట్లు ప్రశ్నించగా.. తామిద్దరం కలిసి పార్టీలలో పాల్గొన్న క్షణాలకు సంబంధించిన వీడియోలని తెలిపింది. ఇక టామ్ క్రూజ్ వ్యక్తిత్వం చాలా అద్భుతంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కాగా, మల్లికా షెరావత్ చేసిన ఈ వ్యాఖ్యలపై టామ్ క్రూజ్ గానీ, ఆయన ప్రతినిధులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు ఇవి పూర్తిగా మల్లికా షెరావత్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలుగానే మిగిలిపోయాయి.

## నాన్‌స్టాప్ నవ్వులు గ్యారెంటీ!

'నేను సరైన కామెడీ సినిమా చేసి పదేళ్లవుతున్నది. 'నాంది' తర్వాత కొన్ని సీరియస్ సినిమాలు చేశాను. కానీ కామెడీని ఎప్పుడూ వదిలిపెట్టలేదు. పదేళ్లుగా మీరు మిస్ అయ్యారనుకున్న నరేష్‌ను ఇందులో చూస్తారు. రెండున్నర గంటల పాటు మిమ్మల్ని నవ్వించే చిత్రమిదని గ్యారెంటీ ఇస్తున్నా' అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా నటించిన ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. ఇంద్రలోకం నుంచి రంభ, ఊర్వశి, మేనక భూలోకంలోకి అడుగుపెడితే ఏం జరిగిందనే సంఘటనల నేపథ్యంలో టీజర్ ఆద్యంతం నవ్వుల్ని పంచింది. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ 'నేను చిన్నప్పటి నుంచి నాగార్జునగారికి పెద్ద అభిమానిని. 'నా సామిరంగా'లో ఆయనతో కలిసి నటించా. ఇప్పుడు ఆయన బ్యానర్‌లో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమా థియేటర్లలో నవ్వులమోత మోగిస్తుందని, అన్నపూర్ణ స్టూడియోస్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ బ్యానర్‌తో కలిసి సినిమా చేయడం ఆనందంగా ఉందని నిర్మాత రాజేష్ దండా పేర్కొన్నారు. ఫాంటసీ, గ్రామీణ నేపథ్యాన్ని కలిపి ప్రేక్షకుల్ని నవ్వించాలనే లక్ష్యంతో సినిమా చేశామని దర్శకుడు చంద్ర మోహన్ చింతాడ తెలిపారు. యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## చదరంగ 'చిరు'త



తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది ప్రతిభావంతులైన చెస్ ప్లేయర్లు వచ్చారు. కోనేరు హంపి, హారిక, హరికృష్ణ, అర్జున్, లలిత్‌బాబు, రాజా రిత్విక్ లాంటి వాళ్లు గ్రాండ్‌మాస్టర్లు అయ్యారు. ఇప్పుడు వారి బాటలోనే మరో తార దూసుకొచ్చింది. చిన్న వయసులోనే ఈ ఆటలో వేగంగా అడుగులు వేస్తోంది. ఆ యువ కెరటం పేరు మోదుపల్లి దీక్షిత. అండర్-16లో ప్రపంచంలో టాప్ ర్యాంక్ ప్లేయర్‌గా ఉన్న 14 ఏళ్ల దీక్షిత.. ఇటీవలే తొలి ఇంటర్నేషనల్ మాస్టర్ నార్మ్‌ను దక్కించుకుంది. నెల వ్యవధిలో 29 వేలకుపైగా స్థానాలను మెరుగుపరుచుకోవడం దీక్షిత దూకుడుకు నిదర్శనం.

దీక్షిత కుటుంబం స్వస్థలం అనంతపురంలోని హంపాపురం. ఆమె తండ్రి శేషాద్రి నాయుడుది సాఫ్ట్‌వేర్ వృత్తి. ప్రస్తుతం ఆమె కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. వెలాసిటీ చెస్ అకాడమీలో కోచ్, ఇంటర్నేషనల్ మాస్టర్ కృష్ణతేజ దగ్గర చదరంగంలో ఓనమాలు దిద్దుకున్న ఈ బాలిక.. వయసు విభాగాల్లో టోర్నీల్లో సత్తా చాటి వెలుగులోకి వచ్చింది. జాతీయ అండర్-13 ఛాంపియన్‌షిప్, జాతీయ పాఠశాల క్రీడల చెస్‌లో విజేతగా నిలిచి సత్తా చాటింది దీక్షిత. ఆపై ఐరోపా సర్క్యూట్‌లో ఆడుతూ రేటింగ్‌లో మెరుగవుతూ వచ్చింది. ముఖ్యంగా గత నాలుగు ఐరోపా టోర్నీల్లో దీక్షిత సత్తా చాటింది. స్పెయిన్‌లో జరిగిన లా ప్లాగ్‌నె మైత్రె, మెనిరెస్ మాస్టర్స్, టొర్నియో ఇంటర్నేషనల్, లెకా ఓపెన్లలో ఆమె మొత్తం 11 విజయాలు సొంతం చేసుకుంది. తనకన్నా మెరుగైన 11 మంది ర్యాంక్ ప్లేయర్లను ఓడించింది. వీరిలో ముగ్గురు ఇంటర్నేషనల్ మాస్టర్లు ఉన్నారు. నెల వ్యవధిలో 484.8 రేటింగ్ పాయింట్లు మెరుగుపరుచుకున్న దీక్షిత 1985 నుంచి 2454వ రేటింగ్‌కు ఎగబాకింది. ఈ క్రమంలో ఏకంగా 29,200 స్థానాలు మెరుగై మొత్తంగా మహిళల చెస్‌లో 499వ ర్యాంకుకు చేరుకుంది.

తాజా ప్రదర్శనతో అండర్-16లో ఈ తెలుగమ్మాయి (2454, లైవ్ రేటింగ్స్‌లో) అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. అనస్తాసియా (ఉక్రెయిన్, 2465) రెండో స్థానంలో ఉంది. క్లాసికల్ చెస్‌లో ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం దీక్షిత 17వ స్థానంలో నిలిచింది. కోనేరు హంపి (2522), దివ్య దేశ్‌ముఖ్ (2495), వైశాలి రమేశ్‌బాబు (2484) తర్వాత దీక్షిత నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. "సాధారణంగా చదరంగంలో చిన్నపిల్లలు తప్పులు చేస్తుంటారు. ఒక తప్పు చేశాక ఇక ఆట అయిపోయినట్లే అని వదిలేస్తారు. కానీ దీక్షిత అలా కాదు.. అక్కడి నుంచే పోరాడుతుంది. మానసికంగా ఆమె చాలా బలంగా ఉంటుంది" అని కోచ్ కృష్ణ చెప్పాడు.

## హార్దిక్ పాండ్య డిమాండ్‌కు గుజరాత్ టైటాన్స్ నో..!




భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఐపీఎల్ భవితవ్యంపై రకరకాల కథనాలు వస్తున్నాయి. ముంబయిని వీడేందుకు హార్దిక్ మొగ్గు చూపుతున్నాడని.. కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో ఒక ఫ్రాంచైజీ తీసుకొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని వాటి సారాంశం. తాజాగా హార్దిక్ తన పాత జట్టు గుజరాత్ టైటాన్స్‌కు వెళ్తాడని ప్రచారం సాగుతోంది. తొలుత జీటీ కూడా అంగీకరించిందని.. అయితే, హార్దిక్ ఒక కండీషన్ పెట్టడంతోనే చర్చలు ఆగినట్లు తెలుస్తోంది.

"గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ కూడా హార్దిక్ తిరిగి రావడాన్ని స్వాగతించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తోనూ చర్చించింది. మళ్లీ పాండ్యను ట్రేడ్ చేసేందుకు అంగీకరించింది. అయితే, హార్దిక్ ఎప్పుడైతే 'కెప్టెన్సీ' షరతు విధించాడో.. ఫ్రాంచైజీ అందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. మేనేజ్‌మెంట్ కుదరదు అని చెప్పింది" అని గుజరాత్ టైటాన్స్ వర్గాలు తెలిపాయి.

### పాండ్య చర్చించలేదు

మరోవైపు హార్దిక్ పాండ్య మాత్రం ఇప్పటి వరకూ ఏ ఫ్రాంచైజీతో చర్చించలేదని అతడి సన్నిహితులు చెబుతున్నారు. ఏదైనా సరే ముంబయి జట్టుకు సమాచారం ఇస్తాడని పేర్కొన్నారు. "హార్దిక్ ఐపీఎల్‌లో ఇతర ఫ్రాంచైజీలతో చర్చలు జరపలేదు. ముంబయి కూడా ఎవరితోనూ ట్రేడ్ గురించి సంప్రదింపులు నిర్వహించలేదని చెప్పింది. ఏదైనా సరే ముంబయి ఫ్రాంచైజీకే హార్దిక్ తన అభిప్రాయం చెబుతాడు. అప్పటి వరకు ఎలాంటి ఊహాగానాలకు చోటు ఇవ్వొద్దు" అని పాండ్య ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

## ఇటీవలే క్రికెట్‌కు గుడ్‌బై.. కొత్త పాత్రలోకి అజింక్య రహానే



భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే కొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవలే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా తరపున పదిహేనేళ్లపాటు క్రికెట్ ఆడాడు. ఐపీఎల్‌లోనూ ప్రాతినిధ్యం వహించాడు. ఆటకు గుడ్ బై చెప్పిన తర్వాత ఏం చేస్తాడనేదానికి సమాధానం దొరికింది. మరో మూడు రోజుల్లో శ్రీలంక - భారత్ జట్ల మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు వ్యాఖ్యాతగా అజింక్య రహానే వ్యవహరించనున్నాడు. ఈ మేరకు రహానే, సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్స్ సీఆర్‌వో, బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తమ కామెంట్రీ ప్యానల్‌లోకి రహానేను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు రాజేశ్ తెలిపారు. "భారత్ - శ్రీలంక జట్ల మధ్య టెస్టు సిరీస్‌కు వ్యాఖ్యాతగా అరగేంట్రం చేయనుండటం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది. క్రికెట్‌లో టెస్టు ఫార్మాట్‌కు తిరుగులేదు. భారత్ తరఫున కొన్నేళ్లు టెస్టు మ్యాచులు ఆడా. ఇప్పుడు ఆటను మరో కోణంలో చూడబోతున్నా. నా అనుభవాలు, ఆటలోని మలుపులను అభిమానుల ముందుకు తీసుకొస్తా. నా బ్రాడ్‌కాస్ట్ అనుభవం ఫ్యాన్స్‌ను అలరిస్తుందని అనుకుంటున్నా" అని రహానే వెల్లడించాడు.

గాయం కారణంగా వాషింగ్టన్ సుందర్‌ను శ్రీలంకతో తొలి టెస్టుకు ఎంపిక చేయలేదు. అయితే, కోలుకుని వస్తాడనే అంచనాలతో రెండో మ్యాచ్ స్క్వాడ్‌లో అవకాశం కల్పించింది మేనేజ్‌మెంట్. కానీ, రెండో టెస్టులోనూ అతడు ఆడే అవకాశాలు తక్కువేనని సమాచారం. ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదని తెలుస్తోంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఆగస్టు 23 నుంచి మొదలయ్యే రెండో మ్యాచ్‌కు కొలంబో వేదికగా నిలవనుంది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945